
ఇరుకుపాలెంలో లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న కలెక్టర్ కృతికాశుక్లా

2.72 లక్షల మందికి రూ.120 కోట్లు

పింఛన్ల పంపిణీలో కలెక్టర్ కృతికాశుక్లా

ముప్పాళ్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2.72 లక్షల మందికి రూ.120 కోట్లు పింఛన్ల రూపంలో పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ కృతికాశుక్లా తెలిపారు. మండలంలోని ఇరుకుపాలెంలో శనివారం కలెక్టర్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా పింఛన్లను అందజేసి వారి యోగక్షేమాలు, ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పింఛన్ల పంపిణీలో ఎక్కడా ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని సచివాలయ ఉద్యోగులకు సూచించారు. ఆక్రమణలతో పాటు వివిధ భూ సమస్యలకు సంబంధించిన అంశాలపై స్థానికులు కలెక్టర్‌కి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు అందించాలన్నారు. మండలాధికారులు మొదలుకుని కింది స్థాయి సిబ్బంది వరకు పింఛన్ల పంపిణీలో భాగస్వాములన్నారు. గత నెలలో పింఛన్ల పంపిణీలో సమస్యలు రావడంతో లోపాలను గుర్తించి 70 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. గ్రామస్థుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీరాణి, ఆర్డీవో రమణా కాంత్‌రెడ్డి, తహసీల్దార్ నగేష్, ప్రత్యేక అధికారి రామా రావు, ఎంపీడీవో రత్నం, డీఎల్‌డీవో రాజగోపాల్, ఏపీ ఎమ్ బాలస్వామి, ఏపీవో ఏడుకొండలు, జూనియర్ అసిస్టెంట్ సాయి చరణ్, టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, దరువూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి..రూ.కోటి నష్టం

- తుఫాన్‌తో కోల్పోయిన ఆదాయం
- డిపోలకే మూడు రోజులు బస్సులు పరిమితం

నరసరావుపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ఆర్టీసీకి తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. తుఫాన్ ప్రభావంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో భారీ నుంచి అతి భారీగా వర్షాలు కురిశాయి. బస్సులన్నీ డిపోలకే పరిమితమయ్యాయి. దీంతో చార్జీల రూపంలో వచ్చే ఆదాయాన్ని ఆర్టీసీ కోల్పోవాల్సి వచ్చింది. మరో వైపు తుఫాన్‌తో ప్రజలు కూడా ప్రయాణాలను వాయిదా వేసుకున్నారు. దీంతో గత నెల 27 నుంచి 29 వరకు చార్జీల రూపంలో వచ్చే ఆదాయానికి గండిపడింది.


గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్

ఇక అరకొరగా బస్సులు తిరిగినా చాలా తక్కువగా ప్రయాణికులు ఉన్నట్లు ఆర్టీసీ అధికారులు చెప్పారు. గతంలో నిత్యం గుంటూరు జిల్లాలోని ఐదు డిపోల నుంచి చార్జీల రూపంలో రూ.60 లక్షల నుంచి రూ.70 లక్షల వరకు ఆదాయం వచ్చేది. తుఫాన్‌తో గుంటూరు జిల్లాలోని అన్ని డిపోల్లోనూ రోజువారీ వచ్చే ఆదాయం కోల్పోవాల్సి వచ్చిందని జిల్లా ప్రజారవాణాధికారి సామ్రాజ్యం తెలిపారు. ఇక తుఫాన్ తీరం దాటిన తర్వాత 29న దాదాపుగా అత్యధిక శాతం సర్వీసులు డిపోలకే పరిమి తమయ్యాయి. తుఫాన్ ప్రభావంతో ఎక్కడా ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా ముందు జాగ్రత్తగా అన్ని రూట్లలో బస్సులను రద్దు చేశామని డీపీటీవో తెలిపారు. తుఫాన్ ప్రభావంతో ప్రయాణికులు ప్రయాణాలకు దూరమవడంతో బస్టాండ్లలో వ్యాపారాలు లేక వ్యాపారులకూ నష్టాన్ని మిగిల్చింది. ప్రయాణికుల్లేక బస్టాండ్లలో దుకాణ దారులు దుకాణాలను మూడు రోజులు మూసేశారు.

పురాలకు పన్ను నొప్పి

- ఆస్తి పన్ను వసూలులో అలసత్వం
- బకాయిలు రూ.76.51 కోట్లు
- పట్టణాల్లో కుంటుపడుతున్న ప్రగతి

మునిసిపాలిటీలకు ఏళ్ల తరబడి 'పన్ను' నొప్పి పట్టిపీడిస్తోంది. పన్నుల బకాయిలు భారీగా పేరుకుపోయాయి. వసూలులో అలసత్వం తాండవిస్తోంది. సాధారణ నిధుల లేమితో పట్టణాల్లో ప్రగతి కుంటు పడుతోంది. వడ్డీ రాయితీ ఇస్తున్నా.. బకాయిలను సిబ్బంది వసూలు చేయలేకపోతున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు అంతంతమాత్రమే. కాంట్రాక్టు ఉద్యోగుల జీతాలు చెల్లింపు, ప్రజలకు మౌలి క వసతులు కల్పనకు పన్ను ఆదాయంపైనే మునిసిపాలిటీలు ఆధార పడుతున్నాయి. దీనిపై అధికారుల పర్యవేక్షణ కొరవడిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రకటనల పన్ను పెద్దఎత్తున ఎగవేస్తున్నా చోద్యం చూస్తూ.. అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారన్న ఆరోపణలున్నాయి.



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో పురపాలక సంఘాలకు రూ.76.51 కోట్లు ఆస్తి పన్ను బకాయిలు వసూలు చేయాల్సి ఉన్నట్లు మునిసిపల్ పరిపాలన విభాగం లెక్కలు చెబుతున్నాయి. పట్టణాల్లో ఇబ్బడి ముబ్బడిగా వ్యాపార, వాణిజ్య, రాజకీయ పార్టీల ప్రచార బోర్డు లు ఉంటున్నాయి. వీటి ద్వారా వచ్చే ప్రకటన పన్ను పక్క దారి పడుతోంది. నిబంధనల ప్రకారం ఈ పన్ను విధిం చడంలో.. పట్టీపట్టనట్లు పురపాలకులు వ్యవహరిస్తున్నారు. ప్రకటనలు, వీటి ద్వారా వచ్చే ఆదాయానికి పొంతన ఉండటం లేదు. ఏటా ఒక్కొక్క మునిసిపాలిటీ రూ.లక్షల్లో ఆదాయాన్ని కోల్పోతుంది. ప్రకటనల ఆదాయం పెంచుకునే ప్రయత్నాలు లేవనే చెప్పాలి. కొందరు యాడ్స్ ఏజెన్సీలతో అధికారులు కుమ్మక్కై మునిసిపాల్టీలకు రావాల్సిన ఆదాయాన్ని వదిలేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏదైనా రాజకీయ, ప్రైవేట్ వ్యక్తుల కార్యక్రమాల సందర్భంగా వేల సంఖ్యలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. వీటన్నిటికీ (మిగతా 6వ పేజీలో)


వాగుపై చప్టాకు ప్రత్యామ్నాయంగా నిర్మిస్తున్న వంతెన

పెదమద్దూరు చప్టా శిథిలం

- అల్లాడుతున్న వాహన చోదకులు
- ఏళ్లు గడుస్తున్నా పరిష్కారం కాని సమస్య

అమరావతి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అమరావతి- విజయవాడ రహదారిలోని పెదమద్దూరు వద్ద ఉన్న వాగుపై ఉన్న చప్టా శిథిలావస్థకు చేరింది. ఏళ్లు గడుస్తున్నా పరిష్కారంపై అటు పాలకులు, ఇటు ప్రజాప్రతినిధులు దృష్టి సారించడంలేదు. దీంతో ఆ మార్గంలో వాహన చోదకులు రాకపోకలకు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. వరద సమయంలో గోతుల కారణంగా ప్రమాదాలు చోటుచేసు కుంటున్నాయి. దీంతో వర్షాలు వస్తే ఈ మార్గంలో రాకపోకలు బంద్ అవుతున్నాయి. పెదమద్దూరు సమీపంలో నరుకుళ్లపాడు, ఎండ్రాయి వాగుల్లోని నీరంతా ఈ చప్టాపైగా ప్రవహిస్తుంది. దీంతో ఆ సమయంలో విజయవాడ వెళ్లే బస్సులతో పాటు వాహనాలు నిలిచిపోతుంటాయి. వాగుల్లో ప్రవాహం తగ్గిన తర్వాత రహదారిపై కంకర కొట్టుకుపోయి పెద్దపెద్ద గుంతలు దర్శనమిస్తున్నాయి. కొన్ని సందర్భాలలో ఇసుక లోడుతో వస్తున్న లారీలు ఈ గోతుల్లో దిగబడిపోతున్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు తాత్కాలిక మరమ్మతులతో సరిపెడుతున్నారే కానీ శాశ్వత పరిష్కారంపై దృష్టి సారించడంలేదు. తాత్కాలిక పనులు వరదల్లో కొట్టుకుపోవడంతో సమస్య మళ్లీ మొదటికి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. ఈ మార్గంలో ఆర్టీసీ బస్సు సర్వీసులను నడిపేందుకు ఆలోచిస్తుందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వాగుపై ఉన్న చప్టాకు ప్రత్యామ్నాయంగా నిర్మిస్తున్న హైలెవల్ వంతెనను తాకుతూ వరద ప్రవహిస్తుంది. దీంతో వరద సమయంలో ఈ వంతెన ఉపయోగపడదని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. అధికారులు దీనిని పరిశీలించి వంతెనకు ఇరువైపుల అర కి.మీ పొడవునా రహదారి ఎత్తుపెంచేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


చప్టా సమీపంలో ధ్వంసమైన రోడ్డు


ప్రసంగిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

గిరిజన విద్యార్థినులకు కంప్యూటర్ కోర్సులు

- జన్ జాతీయ గౌరవ దివస్‌లో కలెక్టర్ కృతికా శుక్లా

నరసరావుపేట కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థినులకు కంప్యూటర్ కోర్సులు నేర్పించాలని కలెక్టర్ కృతికాశుక్లా అధికారులను ఆదేశించారు. జన్ జాతీయ గౌరవ దివస్ సందర్భంగా శనివారం గిరిజన బాలికల వసతిగృహాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన బాలికలకు వసతితో పాటు పోటీ ప్రపంచంలో ఉద్యోగాలు పొందేలా నైపుణ్యాలపై శిక్షణ అందించాలన్నారు. బాల్య వివాహాలు చేసుకోకుండా బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని విద్యార్థినులకు సూచించారు. బిర్సా ముండా యువతకు దిక్సూచి అన్నారు. తొలుత వసతిగృహంలో బిర్సా ముండా, ఇతర స్వాతంత్ర్య వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి కలెక్టర్ నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ అధికారి దాసరి అమర్ సుబ్బయ్య, మున్సిపల్ కమిషనర్ జస్వంత్‌రావు పాల్గొన్నారు.

ఉత్సవాలపై ఆరా

- ప్రార్థనలు, వేడుకలపై ప్రభుత్వం దృష్టి
- నివేదిక పంపాలని అధికారులకు ఆదేశాలు
- కాశీబుగ్గ దుర్ఘటనతో ముందస్తు భద్రతకు ఏర్పాట్లు

గుంటూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ దుర్ఘటన నేపథ్యంలో ఆలయాల వద్ద తొక్కిసలాట జరిగి భక్తులు ప్రాణాలు కోల్పోతుండటంతో భద్రత కట్టుదిట్టం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా ఇక నుంచి జరగబోయే ఉత్సవాలను ఒక క్యాలెండర్ రూపంలో తయారు చేసి పంపాలని సూచించింది. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న దేవాలయాలు, మసీదులు, చర్చిలు ఏమిటి? వాటిల్లో జరిగే ఉత్సవాల నిర్వహణ, అవి ఏ తేదీల్లో జరుగుతాయి. సగటున ఎంతమంది భక్తులు వస్తారు. అక్కడ తీసుకోవాల్సిన భద్రతా చర్యలే ఏమిటి వంటి వివరాలపై నివేదిక రూపొందించి పంపాలని ప్రభుత్వం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది. ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాలతో సంబంధిత శాఖల ఉన్నతాధికారులకు వాటిని నివేదించేందుకు కలెక్టరేట్ల అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. జిల్లా పరిధిలోని దేవాలయాలు, చర్చిలలో ఏటా పెద్దఎత్తున ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దర్గాల వద్ద కూడా ఉరుసు ఉత్సవాలు భారీగా జరుగుతున్నాయి. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని ప్రముఖ ఆలయాలు, చర్చిలు, దర్గాల వద్ద ఉత్సవాలు జరిగేటప్పుడు ఆయా నిర్వాహక కమిటీలు ముందుగానే పోలీసులకు తెలియజేస్తాయి. దాంతో వాటి వద్ద బందోబస్తు ఏర్పాటు చేసి తొక్కిసలాట జరగకుండా క్రమబద్ధీకరిస్తుంటారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అమరావతి, మంగళగిరిలో రథోత్సవం భారీగా జరుగుతోంది. అలాగే పొన్నూరు, చేబ్రోలు, బాపట్ల, తెనాలిలోనూ వివిధ పండుగల సమయాల్లో ఉత్సవాలు జరుగుతుంటాయి. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట బైబిల్ మిషన్ మహాసభలు, గోరంట్లలో హోసన్నా మందిరం ఉత్సవాలు జరుగుతుంటాయి. వీటికి ఏటా వేలల్లో భక్తులు తరలి వస్తుంటారు. మస్తాన్‌దర్గా, పెదకాకాని బాజీబాబా ఉరుసు మహోత్సవాలు, ఫిరంగిపురంలో చర్చి ఉత్సవాలకు కూడా జనాలు అధిక సంఖ్యలో తరలివస్తుంటారు. ఇవికాక కంతమరాజు కొండూరు, కొండపాటూరు తిరునాళ్ల, గోవాడలోని ఆలయాల వార్షికోత్సవాలు కూడా భారీగా నిర్వహిస్తారు. పల్నాడు జిల్లాలోని కారంపూడిలో వీరారాధన ఉత్సవాలకు కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలి వస్తుంటారు. శివరాత్రి సమయంలో కోటప్పకొండ తిరునాళ్ల, అమరావతి రథోత్సవం, క్వారీ తిరునాళ్ళ బొప్పూడి ఆంజనేయస్వామి ఆలయం ఉత్సవాలు జరుగుతాయి. బాపట్ల జిల్లాలోనూ భక్తులు ఎక్కువ సంఖ్యలో వచ్చే ప్రార్థనాలయాలు ఉన్నాయి. కొన్ని దేవాలయాలు దేవదాయశాఖ ఆధీనంలో లేకపోవడంతో అవి ప్రైవేటు కమిటీల పర్యవేక్షణలో కొనసాగు తున్నాయి. దీని వలన వాటిల్లో జరిగే ఉత్సవాల గురించి పోలీసుశాఖకు తగిన సమాచారం ఉండటం లేదు. దీని వల్ల అనూహ్యంగా భక్తులు వస్తే తొక్కిసలాట జరుగుతున్నది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఇటీవల కాలంలో ఇలాంటి సంఘటనలే జరిగి ప్రజలు ప్రాణాలు కోల్పోయిన దృష్ట్యా ప్రభుత్వం అన్ని దేవాలయాలకు సంబంధించిన ఉత్సవాలతో ఒక క్యాలెండర్‌ని రూపొందించాలని నిర్ణయించింది. ఆ మేరకు తగిన భద్రత చర్యలు చేపట్టడం ద్వారా ఇకపై తొక్కిసలాట సంఘటనలకు ఆస్కారం లేకుండా చూసేందుకు నివేదికలను పంపాలని ఆదేశించింది.



అమరావతి : క్యూలైన్‌లో కిక్కిరిసిన భక్తులు (పాత చిత్రం)



కుళ్లిన పత్తి.. రంగుమారిన మిర్చి

- సస్యరక్షణకు వీలు లేకుండా పొలాల్లో నీరు
- నష్ట పరిహారంపై రైతుల్లో అయోమయం

మాచవరం, పిడుగురాళ్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. ఖరీఫ్ ఆరంభం నుంచి రైతులు కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఆరంభంలో అకాల వర్షాలతో రైతులు అల్లాడిపోయారు. ఆ తర్వాత వర్షాలు లేక నీటికి ఇబ్బందులు పడ్డారు. ప్రకృతిని ఎదిరించి.. నీటి కష్టాలను అధిగమించి సాగు చేసిన పంటలు నోటికి అందే తరుణంలో తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలతో నీటిపాలయ్యాయి. జిల్లాలో ఈ ఏడాది అకాల, అధిక వర్షాలతో పత్తి, మిర్చి సాగుదారులకు తీరని నష్టం వాటిల్లింది. మొంథా తుఫాన్ ప్రభావంతో వాతావరణంలో విపరీత మార్పులు చోటు చేసుకోవడంతో పత్తి తీతకు అవకాశం లేకుండా పోయింది. ఇదే సమయంలో గాలులకు కాయలు రాలిపోయాయి. చెట్టుకు ఉన్న కాయల్లోకి వర్షపునీరు చేరి కుళ్లు దశకు చేరుకున్నాయి. ఎకరానికి సుమారు ఐదు క్వింటాళ్ల దిగుబడి తగ్గుతుందని రైతులు తెలిపారు. కొద్దో గొప్పో వచ్చిన పత్తిని వ్యాపారులు కొనే పరిస్థితి లేదంటూ ఆవేదన చెందుతున్నారు. మాచవరం మండలంలోని మోర్జంపాడు, మాచవరం, పిడుగురాళ్ల మండలంలోని పందిటివారిపాలెంతో పాటు దాచేపల్లి, గురజాల తదితర మండలాల్లో ముదురుపత్తికి తీవ్రనష్టం వాటిల్లింది. దీంతో పత్తి పీకడం తప్ప ఎందుకూ పనికిరానంతగా నష్టం కనిపిస్తోంది. అధిక వర్షాలతో మిరప పంట కూడా ఉరకేసింది. గాలులకు మిరప మొక్కలు తలలు వాల్చేశాయి. కోతకు వచ్చిన మిర్చి రంగు మారింది. మిర్చిని కాపాడుకునేందుకు రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకునేందుకు సిద్ధమైనా వీలు లేకుండా పోయింది. పొలాలన్నీ బురదమయం కావడంతో రైతులకు ఇబ్బందిగా మారింది. కాగా వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంటలకు జరిగిన నష్టాన్ని అంచనా వేస్తున్నారు. అయితే ఎంతమేర పరిహారం అందుతుందో తెలియక రైతులు అయోమయంలో ఉన్నారు. పరిహారం అందితే కొంతైనా నష్టం నుంచి బయటపడే అవకాశం ఉందని చెప్తున్నారు.


మాచవరంలో వర్షాలకు రంగుమారిన పత్తి పంట


తల వాల్చిన మిరప పంట

విపత్తులో మాచవరాన్ని చేర్చాలి

మాచవరం మండలంలో అధిక వర్షపాతం నమోదైనప్పటికీ తుఫాన్ ప్రభావిత మండలాల జాబితాలో చేర్చకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలతో తీవ్రంగా నష్టం వాటిల్లినా అధికారులు నిర్లక్ష్యంతో తాము పరిహారానికి దూరమవు తామని వాపోతున్నారు. పత్తి పొలాల్లో ఇప్పటికీ నీరు నిలబడి ఉందని, అధిక తేమ వల్ల పంట మొత్తం ఎండిపోతుందని అయినా అధికారులకు కనిపించకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పంటలను పరిశీలించి తుఫాన్ విపత్తులో మండలాన్ని చేర్చేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

'డాక్టర్ రెడ్డీస్'లో ఉద్యోగాలకు ఏఎన్‌యూ విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న ఇన్‌చార్జి వీసీ గంగాధరరావు, రిజిస్ట్రార్ సింహాచలం తదితరులు

ఏఎన్‌యూ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని బోటనీ, మైక్రో బయాలజీ, బయోకెమిస్ట్రీ, బయో టెక్నాలజీ విద్యార్థులు హైదరాబాద్‌లోని డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్‌లో ఇంటర్నషిప్‌తో పాటు శాశ్వత ఉద్యోగాలకు ఎంపికయ్యారు. విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ఈ నెల 3 నుంచి వచ్చే ఏడాది మే 31వ తేదీ వరకు కొనసాగనుంది. ప్రతి విద్యార్థికి నెలకు రూ.25వేలు పారితోషకం లభించనుంది. విజయవంతంగా ఇంటర్న్‌షిప్‌ను పూర్తి చేసిన తర్వాత విద్యార్థులు రూ.5 లక్షలు వార్షిక వేతనంతో ఉద్యోగంలో చేరనున్నట్లు తెలిపారు. విద్యార్థులు అరిస లక్ష్మి అనూష, జి.సత్తిబాబు, భావనా, వేమూరి శైలజ, రోహిణి లింగుడు, సొంగా అజయ్ సుజిత్ ఈ అవకాశాన్ని దక్కించుకున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య కె.గంగాధరరావు, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య వీరయ్య విద్యార్థులను అభినందించారు. ప్రాంగణ నియామకాల అధికారులు డాక్టర్ యు.సూర్య కామేశ్వరి, డాక్టర్ తౌసీఫ్ అహ్మద్, మైక్రోబయాలజీ విభాగాధిపతి ఆచార్య ఉమామహేశ్వరరావు, బయోకెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ కిరణ్మయి, బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ సుధాకర్ పాల్గొన్నారు.

పీజీ, యూజీ పరీక్షల ఫలితాలు విడుదల

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ ఏడాది జూలై, ఆగస్టులో నిర్వహించిన బీటెక్, బీఈడీ, ఎంఎస్సీ నానో టెక్నాలజీ, ఎంటెక్ పరీక్షల ఫలితాలను పరీక్షల నియంత్రణాధికారి ఆలపాటి శివప్రసాద్‌రావు శనివారం విడుదల చేశారు. రీవాల్యూయేషన్ దరఖాస్తులు ఈ నెల 10వ తేదీలోగా అందజేయాలని సూచించారు. పేపర్‌కు రూ.1,860, జవాబు పత్రాల పరిశీలనకు రూ.2,190 చెల్లించాలన్నారు. పరీక్ష ఫలితాలు ఏఎన్‌యూ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు.

'చలపతి' ఆంజనేయులుకు డాక్టరేట్


వైవీ ఆంజనేయులు

తాడికొండ, నవంబరు1(ఆంధ్రజ్యోతి): చలపతి విద్యాసంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులకు అమెరికాలోని వెర్మంట్‌లో ఉన్న బర్లింగ్టన్ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. విద్యా, సామాజిక సేవా రంగాల్లో విశిష్ట సేవలకు గుర్తింపుగా డాక్టరేట్ ఇచ్చింది. గ్రామీణ ప్రాంత విద్యార్థుల విద్యాభివృద్ధే లక్ష్యంగా కేజీ నుంచి పీజీ, ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలలను స్థాపించి విద్యా ప్రదాతగా చలపతి ఆంజనేయులు పేరు ప్రఖ్యాతలు సాధించారు. ఎమ్మెల్యేగా గెలిచి ప్రజలకు సేవ చేశారు. యలమంచిలి ఫౌండేషన్ ద్వారా విద్యా, వైద్యం, ఆధ్యాత్మికం పలు సామాజిక కార్యక్రమాలు చేపట్టిన వ్యక్తి వైవీ ఆంజనేయులకు డాక్టరేట్ రావడం సంతోషంగా ఉందని చలపతి విద్యా సంస్థల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

చింతలతండాలో వైసీపీ కార్యకర్త ఉన్మాదం

● మహిళను కత్తితో పొడిచిన చందర్‌నాయక్

విజయపురిసౌత్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): వితంతవును లోబరుచుకోవడమే కాకుండా.. ఆమె ద్వారా ఆర్థికంగా లబ్ధి పొంది.. తిరిగి నగదు ఇవ్వాలన్నందుకు వైసీపీ కార్యకర్త కత్తితో హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మాచర్ల మండలం చింతలతండాలో జరగగా.. ఆలస్యంగా విషయం వెలుగులోకి వచ్చింది. చింతలతండా గ్రామానికి చెందిన రమావత్ రాణితో అదే గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త రమావత్ చందర్ నాయక్ సాన్నిహిత్యం ఏర్పరుచుకున్నాడు. ఆమె ద్వారా కొంతమంది నుంచి డబ్బులు అప్పుగా తీసుకున్నాడు. కొంత కాలంగా అప్పుల వాళ్లు డబ్బులు తిరిగి ఇవ్వాలని రాణిని అడుగుతున్నారు. దీంతో డబ్బులు ఇవ్వాలని గత నెల 13న చందర్‌నాయక్‌పై రాణి ఒత్తిడి తెచ్చింది. ఆగ్రహానికి గురైన చందర్‌నాయక్ అదే రోజు కత్తితో రాణిని పలుమార్లు పొడిచాడు. ఎస్‌ఐ అశోక్ రాణిని మాచర్ల గుంటూరుకు చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స అనంతరం బయటకు వచ్చిన బాధితురాలు శనివారం మీడియాతో తనగోడు వెల్లబోసుకుంది. అయితే.. నిందితుడు చందర్‌నాయక్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రభుత్వాస్పత్రిని అభివృద్ధి చేస్తాం

● కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని ● రూ.10 కోట్ల విరాళంతో ముందుకొచ్చిన దక్కన్ టుబాకో


ఎంవోయూతో డీఎంఈ రఘునందన్, రమణ యశస్వి, షఫిక్ ఖాన్, చిత్రంలో కేంద్ర మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే నసీర్

గుంటూరు మెడికల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ వైద్య బోధన ఆసుపత్రిని రాబోయే నాలుగేళ్లల్లో ఊహించని రీతిలో అభివృద్ధి చేస్తామని, ఇందుకోసం పక్కాగా ప్రణాళికలు సిద్ధం చేశామని కేంద్ర కమ్యూనికేషన్, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. గుంటూరు జీజీహెచ్‌లో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద రూ.10 కోట్ల వ్యయంతో నూతన ఆర్థో, ట్రామా బ్లాక్‌ను నిర్మించేందుకు దక్కన్ టుబాకో ఎక్స్‌పోర్ట్స్ కంపెనీ ముందుకు వచ్చింది. శనివారం శుశ్రుత హాల్‌లో దీనిపై ఎంఓయూ కుదిరింది. కేంద్ర మంత్రి డాక్టర్ చంద్రశేఖర్, తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో.. ప్రభుత్వం తరఫున వైద్య విద్య సంచాలకులు డాక్టర్ జి.రఘునందన్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి, దక్కన్ టొబాకో ఎక్స్‌పోర్ట్స్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ షఫిక్ ఖాన్ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ దక్కన్ సంస్థ ప్రపంచస్థాయి నాణ్యత ప్రమాణాలతో జీ ప్లస్ ఐదు అంతస్తులుతో ఆర్థో, ట్రామా బ్లాక్‌ను నిర్మిస్తుందని తెలిపారు. నెల రోజుల్లో నిర్మాణ పనులు ప్రారంభి స్తారని, 18 నెలల్లో పనులు పూర్తి చేస్తారని వివరించారు. ఈ బ్లాక్‌లో 85 సాధారణ పడకలు, 15 ఐసీయూ బెడ్స్, రెండు ఆపరేషన్ థియేటర్లు, ఫిజియోథెరపీ యూనిట్ వంటివి ఉంటాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ..14 నెలల్లోనే గుంటూరు జీజీహెచ్‌కు రూ.82 కోట్లు సీఎస్ఆర్ నిధులు సమకూర్చినట్లు పెమ్మసాని వెల్లడించారు. సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ అజీజ్ ఖాన్ ఆర్థో అండ్ ట్రామా బ్లాక్‌గా నామకరణం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీల, కార్పొరేటర్ పోతురాజు సమత, కూటమి నేతలు గాదె వెంకటేశ్వరరావు, తిరుపతిరావు, వజ్రాణం హరిబాబు, హెచ్‌డీఎస్ సభ్యులు డాక్టర్ ఎస్.ఉమాశంకర్, డాక్టర్ సయ్యద్ రసూల్ పాల్గొన్నారు.

కడుపు మంటతో రగిలిపోతున్నారు

● రాష్ట్రాభివృద్ధిని తట్టుకోలేని వైసీపీ నేతలు ● ఎమ్మెల్యేలు యరపతినేని, కన్నాలక్ష్మీనారాయణ

దాచేపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి గూగుల్ డేటా సెంటర్, పరిశ్రమలు రావడం, సూపర్ 6 పథకాలు అమలవడంతో.. ఎక్కడా లేని ఆవేదన, కడుపు మంటతో వైసీపీ నేతలు రగిలిపోతున్నారని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు విమర్శించారు. రాష్ట్రంలో ఏదో ఒకటి జరగాలి, ప్రభుత్వం అప్రతిష్ఠ కావాలి, కులాల కుంపట్లో చలి కాచుకోవాలనేలా వారి తీరు ఉందని మండిపడ్డారు. గత ఎన్నికల్లో 11 సీట్లతో ఆ పార్టీని ప్రజలు సరి పెట్టినా ఆత్మవిమర్శ చేసుకోలేదని, వారి భాషలో మార్పు లేదని యరపతినేని దుయ్యబట్టారు. శనివార పింఛన్ల పంపిణీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ పాలనలో రాష్ట్రం ఆర్థికంగా పతనమైందన్నారు. ప్రస్తుతం ప్రతి నెలా ఒకటవ తేదీ వచ్చిందంటే రాష్ట్రంలో పెద్ద పండుగగా మారింది. పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ఏపీ ప్రభుత్వం గంట కూడా ఆలస్యం చేయకుండా లబ్ధిదారులకు అమలు చేస్తోందన్నారు. ఆర్థికంగా బలంగా ఉన్న ఇతర రాష్ట్రాల్లో కూడా ఆరు వందలు, ఏడు వందల రూపాయలు పింఛను ఇస్తుంటే.. ఇక్కడ నాలుగు వేల రూపాయలు ఇస్తున్నామన్నారు.

2029లో జగన్ మోహన్‌రెడ్డి గెలిచే పరిస్థితి లేదు

దాచేపల్లి ఆర్అండ్‌బీ బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే యరపతినేనితో పాటు సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ హాజరై విలేకరులతో మాట్లాడుతూ.. 2029 ఎన్నికల్లో పులివెందుల నుంచి జగన్‌మోహన్‌రెడ్డి గెలిచే పరిస్థితులు లేవని ఎద్దేవా చేశారు. జగన్ అధికారంలోకి రావటంతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైందని ఆరోపించారు. ప్రజాస్వామ్యం కనుమరుగైందని కన్నా విమర్శించారు. పోలీసు కేసులు పెట్టడం మినహా జగన్ పాలనలో రాష్ట్ర ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా 20 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు.

సాతులూరులో పోలీసుల కార్డెన్ సెర్చ్

మారణాయుధాలు, 28 మోటారు బైక్‌ల స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మారణాయుధాలతో డీఎస్పీ హనుమంతరావు, సీఐ సుబ్బనాయుడు తదితరులు

నాదెండ్ల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాతులూరు గ్రామంలో పోలీసులు శనివారం తెల్లవారుజామున కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. నరసరావుపేట ఇన్‌చార్జి డీఎస్పీ ఎం.హనుమంతరావు, రూరల్ సీఐ బి.సుబ్బనాయుడు ఆధ్వర్యంలో గ్రామంలోని పలు కాలనీల్లో గల ఇళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కత్తులు, గొడ్డళ్లు, ఇనుప రాడ్లతో పాటు పత్రాలు లేని 28 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ హనుమంతరావు మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయించినా, సేవించినా వారి వివరాలను పోలీసులకు అందించాలన్నారు. ఈ తనిఖీల్లో పట్టణ సీఐ రమేష్, ఎస్ఐలు పుల్లారావు, చెన్నకేశవులు, అనీల్, రహమతుల్లా, 127 మంది సిబ్బంది పాల్గొన్నారు.

పురాలకు పన్ను నొప్పి..

(5వ పేజీ తరువాయి)

ప్రకటన పన్ను వసూలు చేయాలి. కానీ, పరిస్థితి ఇందుకు భిన్నం గా ఉంది. పన్ను వసూలు చేయక పో గా.. వాటిని తొలగించడానికి సిబ్బందికి వేతనాలు చెల్లిస్తు పరిస్థితి కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో నెలకొంది. ప్రకటనల పన్ను ఆదాయం పెంచుకొనే దిశగా పురపాలకుల చర్యలు లేవన్న విమర్శలున్నాయి.

పేరుకుపోతున్న ఆస్తి పన్ను బకాయి

ఆస్తి పన్ను బకాయిలు ఏళ్ల తరబడి పేరుకుపోతున్నాయి. వీటిపై అధికారులు దృష్టి సారించడం లేదు. గుంటూరు జిల్లాలోని గుంటూరు కార్పొరేషన్‌తో సహా పన్నుల బకాయిలు భారీగానే ఉన్నాయి. ఈ జిల్లాలో రూ.61.63 కోట్లు పన్ను బకాయిలు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. జీఎంసీలో రూ.53.11 కోట్లు, మంగళగిరి మునిసిపాల్టీలో రూ.4.89కోట్లు బకాయిలు ఉన్నాయి. బాపట్ల జిల్లాలోని మునిసిపాల్టీలకు సంబంధించి రూ.3.72 కోట్లు ఆస్తి పన్ను బకాయి ఉంది. చీరాల పురపాలక సంఘంలో రూ.1.92 కోట్లు వసూలు చేయాలి. పల్నాడు జిల్లాలోని మునిసిపాల్టీల్లో రూ.11.16 కోట్లు బకాయి ఉంది. ఒక్క నరసరావుపేట మునిసిపాల్టీలో రూ.3.62 కోట్లు, చిలకలూరిపేట, సత్తెనపల్లి మునిపాల్టీల్లో రూ.2 కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయి. బకాయి వసూలు చేస్తే పట్టణాల్లో ప్రజలకు అవసరమైన ప్రగతి పనులు చేపట్టే అవకాశం ఉంటుంది. ఈ దిశగా పురపాలకులు స్పందించాలి.

దేశంలో పది అగ్రశ్రేణి కళాశాలల్లో ఒకటిగా జీఎంసీ

● ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి


డాక్టర్ సుందరాచారిని అభినందిస్తున్న మహిళా వైద్యులు

గుంటూరు మెడికల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): గుంటూరు మెడికల్ కాలేజీని దేశంలోని పది అగ్రశ్రేణి మెడికల్ కళాశాలల్లో ఒకటిగా నిలబెట్టడం తమ లక్ష్యమని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారీ తెలిపారు. జీఎంసీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ సుందరాచారి బాధ్యతలు స్వీకరించి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం కాలేజీలో జీఎంసీ 365 పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 80 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ వైద్య విద్యా సంస్థలో తాను చదివి, ప్రిన్సిపాల్‌గా సేవ చేసే అవకాశం రావడం తన అదృష్టమని డాక్టర్ సుందరాచారీ తెలిపారు. కళాశాలలో మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తే వైద్య విద్య బోధన ప్రమాణాలు మరింత మెరుగౌతాయని ఆయన తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రతి లెక్చర్ గ్యాలరీని ఆధునీకరించి, అధునాతన స్మార్ట్ బోర్డులతో, సాంకేతిక వసతులతో బలోపేతం చేస్తున్నట్లు చెప్పారు. ప్రయోగశాలలను కూడా ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. ఏడాది కాలంలో గుంటూరు మెడికల్ కాలేజ్ అభివృద్ధి కోసం పూర్వ విద్యార్థులు, సామాజిక సేవా భావం కలిగిన దాతలు కలిసి సుమారు రూ.7.7 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామన్నారు. కళాశాల సీడీఎస్ నిధుల ద్వారా సుమారు రూ.1.5 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ, జీఎంసీ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ మాధవి, విభాగాధిపతులు పాల్గొన్నారు.

గుడి వద్ద వివాదం..
తెరుచుకోని ఆలయ ద్వారాలు


చుండూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మున్నంగివారిపాలెంలోని తుంగభద్ర కాల్వ పక్కనే ఉన్న శ్రీ కాశీవిశ్వేశ్వర పాన వినాశేశ్వరస్వామి దేవాలయం వద్ద శనివారం పూజలు విషయంలో వివాదం ఏర్పడింది. ఏండోమెంట్ పరిధిలోని ఈ దేవాలయానికి శాశ్వత ధర్మకర్తనంటూ గ్రామానికి చెందిన గాదె బాలకోటిరెడ్డి దేవాలయ తాళాలు తన దగ్గర ఉంచుకుని తలుపులు తెరవలేదు. శనివారం కార్తిక మాస ఏకాదశి పర్వదినం కావడంతో భక్తులు పూజల కోసం అధిక సంఖ్యలో వచ్చారు. ఆలయ అధికారి నాగలక్ష్మి ఆలయంపై ఎలాంటి హక్కులు, అధికారులు లేవని ఇది ఎండోమెంట్ పరిధిలోనిదని బాలకోటిరెడ్డిని వారించినా.. తాళాలు ఇవ్వలేదు. గ్రామ సర్పంచ్ శ్రీరామమూర్తి, భక్తులు ఆగ్రహం వ్యక్తం చేసినా, ఈవో నచ్చజెప్పినా వినకపోవడంతో.. మధ్యాహ్నం వరకు వేచి ఉన్న మహిళా భక్తులు నిరుత్సాహంతో వెనుదిరిగారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు సమాచారం ఇస్తానని ఈవో తెలిపారు.


గుడి తాళాలు ఇవ్వడానికి నిరాకరిస్తున్న బాల కోటిరెడ్డి

ఆరోగ్య సంరక్షణలో నర్సింగ్ విద్యార్థుల పాత్ర కీలకం

● సీబీసీ అసిస్టెంట్ డైరెక్టర్ రమేష్‌చంద్ర

గుంటూరు(విద్య), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సంరక్షణలో నర్సింగ్ విద్యార్థులు కీలక భూమిక పోషిస్తారని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్(సీబీసీ) అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.రమేష్‌చంద్ర అన్నారు. అమరావతి రోడ్డులోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో శుక్రవారం మొక్కలు నాటి, స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌చంద్ర మాట్లాడుతూ స్వచ్ఛతా లక్ష్యాలను సాధించేందుకు ఆరోగ్య వృత్తి నిపుణులు మార్గదర్శకులగా ఉండాలని సూచించారు. వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ, స్థిరత్వం, పారిశుధ్యం అంశాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వేమూరి వసుంధర తదితరులు పాల్గొన్నారు. ప్రతిభ, స్వచ్ఛతా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్న విద్యార్థులకు సీబీసీ ఆధ్వర్యంలో బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.


మొక్కలు నాటుతున్న అధికారులు సీబీసీ అసిస్టెంట్ డైరెక్టర్ రమేష్‌చంద్ర తదితరులు

స్టాలిన్‌బాబు సేవలు చిరస్మరణీయం : రామకృష్ణ

గుంటూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టుగా, విద్యార్థి, యువజనోద్యమ నేతగా, ఆల్ ఇండియా ఎల్ఐసీ ఏజెంట్స్ అసోసియేషన్ నాయకుడిగా బొప్పూడి స్టాలిన్‌బాబు అందించిన సేవలు చిరస్మరణీయమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ ప్రశంసించారు. బొప్పూడి స్టాలిన్‌బాబు ఆత్మీయ నివాళి సభ గుంటూరు శ్యామలనగర్‌లోని మెట్టు మల్లారెడ్డి కన్వెన్షన్ హాలులో శనివారం జరిగింది. అవగాహన సంస్థ కార్యదర్శి కొండ శివరామిరెడ్డి, సీపీఐ జాతీయ సమితి సభ్యులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు సభకు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రామకృష్ణ మాట్లాడుతూ స్టాలిన్‌బాబు ఉపన్యాసం సుదీర్ఘంగా, స్ఫూర్తిదాయకంగా ఉంటుందన్నారు. మరికొంత కాలం ఆయన కమ్యూనిస్టు ఉద్యమంలో కొనసాగి ఉంటే సురవరం సుధాకర్‌రెడ్డి తరువాత అంతటి స్థాయికి ఎదిగి ఉండేవారన్నారు. విలువలనేవే లేకుండా పోతున్న ప్రస్తుత సమాజంలో ఇంతమంది శ్రేయోభిలాషులు, మిత్రులను సంపాదించుకున్న స్టాలిన్ బాబు మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ 'స్టాలిన్' అనే పేరు ఒక స్ఫూర్తి అని, అటువంటి పేరు పెట్టుకున్న స్టాలిన్ బాబు వందలాది మంది ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ కార్యకర్తలు తయారు కావడానికి కారకుడు అయ్యాడని అన్నారు. ఆల్ ఇండియా ఎల్ఐసీ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రెటరీ భీమిశెట్టి మార్కండేయులు మాట్లాడుతూ ఎల్ఐసీలో ఎంతోమంది నాయకులను తయారు చేయడంలో ఆయన సఫలీకృతులయ్యారన్నారు. వారిలో తాను ఒకడినని తెలిపారు. శ్రీ వెంకటేశ్వర బాలకుటీర్ సీఈవో నాగళ్ళ రఘు రామ్ మాట్లాడుతూ స్టాలిన్‌బాబు సంఘజీవి అని, ఎంతో నిబద్ధత, క్రమశిక్షణ కలిగిన వారని కొనియాడారు. స్టాలిన్ బాబు విజయాల వెనుక ఆయన సతీమణి మరుద్వతి పాత్ర ఎనలేనిదని కొనియాడారు. ఈ సందర్భంగా స్టాలిన్‌బాబు చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజా నాట్య మండలి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు, సెంట్రల్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ ఆర్.రాము, ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, సీపీఐ జాతీయ సమితి సభ్యులు ముప్పాళ్ళ నాగేశ్వర రావు, ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, ఏపీ స్పిన్నింగ్ మిల్స్ అసోసియేషన్ చైర్మన్ సామినేని కోటేశ్వర రావు, ఎల్ఐసీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	132, 141, 152
చికెన్ విత్ స్కిన్(కిలో)	252.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	262.00

టీడీపీ గ్రామ కమిటీల అత్యవసర సమావేశం

అచ్చంపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 22 గ్రామాల టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుల అత్యవసర సమావేశం మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆశీర్వాదం గ్రామ కమిటీల అధ్యక్షులకు సూచించారు. అన్ని గ్రామాల నుంచి గ్రామ కమిటీల అధ్యక్షులు పాల్గొన్నారు. ట్రావెలర్స్ బంగ్లాలో జరిగిన ఈ సమావేశంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరణ

సత్తెనపల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవాసంఘం సమాఖ్య అధ్యక్షుడు కోనూరు సతీష్‌శర్మ నేపథ్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని బ్రాహ్మణ నిరుద్యోగ యువత కోసం డిసెంబరు 13న గుంటూరు హిందూ కళాశాల ఫార్మసీలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీ రంగారావు తెలిపారు. శనివారం సమాఖ్య ఆధ్వర్యంలో బ్రాహ్మణ నిరుద్యోగ యువత కోసం ఏర్పాటు చేస్తున్న మెగా జాబ్ మేళా పోస్టర్లను ఆయన సమాఖ్య నాయకులతో కలసి ఆవిష్కరించారు. ఈ నెల 23వ తేదీ లోపు నిరుద్యోగ యువతీ యువకులు ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

పెద్దింటమ్మ ఆలయంలో చోరీ

అమరావతి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అమరావతి ప్రజల గ్రామదేవత పెద్దింటమ్మ ఆలయంలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలోని హుండీ పగులకొట్టి అందులో ఉన్న నగదును అపహరించుకుపోయారు. శనివారం ఉదయం ఆలయ నిర్వాహకులు ఆలయానికి వెళ్లి చూడగా గేట్లు పగులగొట్టి ఆలయంలోని హుండీ, బీరువా తెరిచి ఉండటం గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సీఐ అచ్చియ్య ఆధ్వర్యంలో ఎస్ఐ రాజశేఖర్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. క్లూస్ టీం వేలి ముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డిప్యూటీ ఎంపీడీవోల బాధ్యతల స్వీకారం



ఎంపీడీవో వాణి నుంచి నియామకపత్రం అందుకుంటున్న డిప్యూటీ ఎంపీడీవో సుబ్బారావు

పిడుగురాళ్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ డిప్యూటీ ఎంపీడీవోగా బి.సుబ్బారావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. చేబ్రోలు మండలంలో గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ పదోన్నతిపై పిడుగురాళ్ల డిప్యూటీ ఎంపీడీవోగా నియమించడంతో సుబ్బారావు ఎంపీడీవో వాణిని కలిసి నియామకపత్రం అందజేశారు.

● రెంటచింతల డిప్యూటీ ఎంపీడీవోగా ఎస్ బాబురావును నియమిస్తూ జడ్పీ సీఈవో జ్యోతిబసు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన యడ్లపాడు నుంచి ప్రమోషన్‌పై ఇక్కడకు వచ్చారు.

● నకరికల్లు డిప్యూటీ ఎంపీడీవోగా జేయమున శనివారం బాధ్యతలు స్వీకరించారు.

మాజీ సర్పంచ్‌కి పితృ వియోగం

మాచవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ షేక్ మాబూవలి తండ్రి హుస్సేన్ సాహెబ్ శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాబూవలిని ఫోన్‌లో పరామర్శించి తండ్రి మృతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. టీడీపీ నాయకులు తురకపాలెం గ్రామానికి చేరుకొని హుస్సేన్ సాహెబ్ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

రూ.30 లక్షల పరిహారం చెల్లించాలి

మాచర్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గొర్రెల కాపరి జగ్గప్పల సాయి మృతికి కారణమైన రమావత్ బుద్దానాయక్‌ను శిక్షించి సాయి కుటుంబానికి రూ.30 లక్షల నష్టపరిహారం చెల్లించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పూసపాటి వెంకట్రావు, జిల్లా అధ్యక్షుడు తిక్కా నాగేశ్వరరావులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో మృతదేహాన్ని సందర్శించి కుటుంబసభ్యులను పరామర్శించారు.

జూదరుల అరెస్టు

పెదకూరపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఐదుగురు జూదరులను అరెస్టు చేసి వారి నుంచి రూ.10,100 స్వాధీనం చేసుకున్నట్టు పెదకూరపాడు ఎస్ఐ గిరిబాబు శనివారం తెలిపారు. వీరిని కోర్టుకు హాజరుపరచనున్నట్టు ఆయన వివరించారు.

వైద్యవిద్యపై అవగాహన సదస్సు

పిడుగురాళ్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) పిడుగురాళ్ల బ్రాంచ్ అధ్యక్షుడు డాక్టర్ ధూళిపాళ్ల భరత్‌కుమార్ ఆధ్వర్యంలో నిరంతర వైద్య, విద్య కార్యక్రమాలపై అవగాహన సదస్సు జరిగింది. ఒమెగా హాస్పిటల్ గుంటూరుకు చెందిన వైద్యులు ఎన్‌వీఎస్ ప్రవీణ్ మాట్లాడుతూ క్యాన్సర్ రోగులకు ముందస్తు అవగాహన, ఏడాదికొకసారి పరీక్షలు నిర్వహించడం ద్వారా క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించి నివారించేందుకు ఇప్పుడు వైద్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భరత్‌కుమార్, ఐఎంఏ కార్యదర్శి బొర్రా రాంప్రసాద్, ఉపాధ్యక్షుడు సునీల్‌కుమార్, డాక్టర్ ఆలా సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

కోటేశ్వరమ్మకు ఘన సన్మానం

దుర్గి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న కోటేశ్వరమ్మ ఉద్యోగ విరమణ పొందారు. ఈ మేరకు శనివారం హైస్కూల్లో కోటేశ్వరమ్మ దంపతులను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

వరదల్లో వైసీపీ బురద రాజకీయాలు

● మొంథా మిగిల్చిన సవాళ్లను అధిగమిస్తాం
● నష్టపోయిన ప్రతి ఒక్కరినీ ఆదుకుంటాం
● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

మాచర్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వరదల్లో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఇబ్బందులు పడుతుంటే వారికి అండగా నిలవాల్సిన తరుణంలో వైసీపీ నాయకులు రాబందుల్లా మారి బురద రాజకీయం చేస్తున్నారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో వరద ముంపు ప్రాంతాలైన 1, 15, 39, 31 వార్డుల్లో పర్యటించి తుఫాన్ బాధితులకు నిత్యావసర సరుకులు, నగదు సాయం అందించారు. అనంతరం ఆజాద్‌నగర్ కాలనీలో చంద్రవంక వాగుపై ఉన్న లోలెవల్ బ్రిడ్జి వరదల్లో పూర్తిగా దెబ్బతిన్న విషయం తెలుసుకొని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ నాయకులు చేస్తున్న విషప్రచారాన్ని దుయ్యబట్టారు. శవ రాజకీయాలను చేయడంలో జగన్‌రెడ్డి అండ్ కో పీహెచ్‌డీలు చేశారని విమర్శించారు. మొంథా తుఫాన్ మిగిల్చిన సవాళ్లను ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కూటమి అన్ని విధాలుగా అధిగమిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వరద బాధితులు, రైతులు ధైర్యంగా



దెబ్బతిన్న లోలెవల్ బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



నిత్యావసరాలను అందిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

ఉండాలని, అందరికీ పరిహారం అందుతుందన్నారు.

దేశంలో కూటమి ప్రభుత్వమే నెంబర్ వన్

సంక్షేమ పథకాల అమల్లో సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వమే నెంబర్ వన్ స్థానంలో ఉందని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని 1, 15 వార్డుల్లో ఆయన పర్యటించి లబ్ధిదారులకు పింఛన్ నగదు అందజేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఆక్రమణలే అభివృద్ధికి అవరోధాలు

రెండు దశాబ్దాలుగా అడ్డూ అదుపు లేకుండా సాగుతున్న ఆక్రమణలే మాచర్ల అభివృద్ధికి అవరోధాలుగా మారాయని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి అభిప్రాయపడ్డారు. శనివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో పట్టణంలో నూతనంగా నిర్మించనున్న ఇన్నర్ రింగ్‌రోడ్డు, కేంద్రీయ విద్యాలయం, వంద పడకల ఆస్పత్రి, చిల్డ్రన్స్ పార్కు, టిడ్కో గృహాల పునర్నిర్మాణం వంటి పలు అభివృద్ధి పనులపై రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా బ్రహ్మానందరెడ్డి అధికారులతో మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనుల్లో అడ్డంకులుగా మారిన ఆక్రమణలు వెనుక ఎంతటి వారున్నా తొలగింపు చర్యలు చేపట్టి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ కొమెర దుర్గారావు, మార్కెట్‌యార్డు చైర్మన్ రాజబోయిన మధు, వైస్ చైర్మన్ గుండాల శ్రీనివాసరావు, టీడీపీ నేతలు యాగంటి మల్లికార్జునరావు, కజ్జం సైదయ్య, బ్యంగా రమణ, బండ్ల బ్రహ్మం, శ్రీను, జూలకంటి అక్కిరెడ్డి, వజ్రం నాయక్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి ఆసరా సీఎంఆర్ఎఫ్

వెల్దుర్తి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్యానికి ఆసరా సీఎం సహాయనిధి అని ఎమ్మెల్యే జూలకంటి అన్నారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. 37 మంది లబ్ధిదారులకుగాను రూ.26.80 లక్షల విలువైన చెక్కులను అందించారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు వెన్నుదన్ను

టీడీపీ సభ్యత్వం కార్యకర్తల కుటుంబాలకు వెన్నుదన్ను అని బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు కార్యకర్తల కుటుంబాలకు సభ్యత్వ నమోదు బీమా పథకం ద్వారా ఒక్కొక్కరికి రూ.5 లక్షల నగదు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ కొమెర దుర్గారావు, మైనార్టీ నేతలు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే చంద్రబాబు ధ్యేయం

● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

దాచేపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పేదలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండలంలోని పొందుగుల గ్రామ పంచాయతీలో పింఛన్ పంపిణీ కార్య క్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గార్లపాటి రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

రామయ్య కుటుంబానికి యరపతినేని పరామర్శ

గురజాలటౌన్: మండలంలోని మాడుగుల గ్రామానికి చెందిన నాగెండ్ల రామయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న గురజాల ఎమ్మెల్యే యరపతినేని శనివారం రామయ్య గృహానికి వెళ్లి రామయ్య కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో యాగంటి రామారావు, జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, చావా రామారావు తదితరులు పాల్గొన్నారు.

మాలాధారణ స్వాములకు సద్ది కార్యక్రమం



రంగ నాయకస్వామి ఆలయంలో మాలధారణ స్వాములకు భోజనం వడ్డిస్తున్నయరపతినేని

దాచేపల్లిలో ఐదు వందల సంవత్సరాల క్రితం చరిత్ర కలిగిన శ్రీలక్ష్మీ రంగ నాయక స్వామి దేవాలయంలో మాలాధారణ స్వాములకు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నప్రసాదం అందజేశారు. ఏడువందల మంది దీక్షా స్వాములు సద్ది కార్యక్రమానికి హాజరయ్యారు. అయ్యప్ప స్వామి పడి పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో తంగెళ్ళ శ్రీనివాసరావు, అంబటి నవకుమార్, బొమ్మిరెడ్డి నారాయణ, షేక్ అహమద, బెల్లంకొండ భారతీ బద్రి, కొప్పుల గిరి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప దీక్షాపరులకు అన్నదానం ప్రారంభం

క్రోసూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరులోని వీరభద్ర స్వామి దేవాలయంలో శనివారం నుంచి దీక్షాపరులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. డిసెంబరు 11వ తేదీ వరకు అంటే మండలం రోజులు అన్నదాన కార్యక్రమం జరుగుతుందని అయ్యప్ప సేవాసమితి సభ్యులు తెలియజేశారు.

కారంపూడిలో అన్న ప్రసాదం పంపిణీ

కారంపూడి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీ బొమ్మ సెంటర్లో గల శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద శనివారం శ్రీవాసవీ సేవా అన్న ప్రసాద కమిటీ ఆధ్వర్యాన అన్న ప్రసాదం పంపిణీ చేశారు. నరమాలపాడుకు చెందిన యేచూరి మల్లికార్జునరావు, పద్మావతి, ప్రవల్లిక, వెంకటకృష్ణ సాయి ఈ సేవా కార్యక్రమానికి సహకరించారు.

అభివృద్ధి, సంక్షేమంతో కూడిన పాలన అందిస్తున్నాం

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి, సంక్షేమంతో కూడిన పాలన కూటమి అందిస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం ఆయన 8వ వార్డులో ఇంటింటికి వెళ్ళి లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు పెద్దమొత్తంలో సంక్షేమం అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నారు. వార్డులో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎలినేడి రామస్వామి, దరువూరి నాగేశ్వరరావు, మస్తాన్ వలి, నూర్ బాషా జాన్‌బాబు, గజ్జలపూడి స్టాలిన్, సుబ్బారావు, మున్సిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్, మన్నవ శారదాదేవి, పీ అంబిక తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములకు కన్నా నివాళులు

ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా స్థానిక గాంధీ బొమ్మ సెంటర్లో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి, జాతీయ నాయకుల విగ్రహాలకు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర సాధన కోసం పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగం చేశారన్నారు. ఆర్యవైశ్య యువత పొట్టి శ్రీరాములు జయంతి, వర్ధంతులను, సేవా కార్యక్రమాలను నిర్వహించటం అభినందనీయమన్నారు.



క్రిష్టియన్‌పేటలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు

● పట్టణ సీఐ వెంకటరమణ



ద్విచక్ర వాహనాలను స్టేషన్‌కు తరలిస్తున్న సీఐ

మాచర్ల రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వ్యాపారులు, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ తురకా వెంకటరమణ హెచ్చరించారు. శనివారం రోడ్డుపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను ట్రాలీ వ్యాన్‌లో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వ్యాపార సముదాయాలకు ముందు ట్రాఫిక్ నిబంధనల మేరకు ముగ్గుతో హద్దులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ వెంకటరమణ మాట్లాడుతూ దుకాణాల వద్ద నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నిలిపితే దుకాణాల యజమానులు, వాహనదారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే జరిమానా విధిస్తామన్నారు. సీఐ వెంట ట్రెయినీ ఎస్ఐ రమేష్, ఏఎస్ఐ సైదానాయక్, సిబ్బంది ఉన్నారు.

అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● టీడీపీ మండల అధ్యక్షుడు బ్రహ్మయ్య



గారపాడులో దివ్యాంగురాలికి పింఛన్ పంపిణీ చేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు బ్రహ్మయ్య తదితరులు

పెదకూరపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్మమని టీడీపీ మండల అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య అన్నారు. శనివారం పెదకూరపాడు, గారపాడు, బచ్చయ్యపాలెం గ్రామాల్లో పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, మాజీ ఎంపీపీలు బెల్లంకొండ రామగోపాలరావు, గల్లా బాబూరావు, మక్కెన సాగర్, అంద్ర ప్రసాదు తదితరులు ఉన్నారు.

● క్రోసూరు: ప్రతి నెల 1వ తేదీన పింఛన్లను అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కాంద్రు కాశయ్య, మహమ్మద్ షరీఫ్, మార్కెట్ యార్డు డైరెక్టర్ దుద్దుల యోహాన్ అన్నారు. టీడీపీ నాయకులు ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు. 95శాతం పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

● అచ్చంపేట: మండలంలో ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లు 92 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీవో కోయా శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో మొత్తం 38,731 మందికి పింఛన్లు ఉండగా వీరికి రూ.3.75 కోట్లు మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో మండల ప్రత్యేక అధికారి, ఏడీఏ మస్తానమ్మ, ఎంపీడీవో కే శ్రీనివాసరావు రుద్రవరం, వేల్పూరు గ్రామాల్లోని పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు.

● కారంపూడి : మండలపరిధిలోని శనివారం కూటమి నేతలు, అధికారులు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాల మేరకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను అందజేశారు. పట్టణంలో టీడీపీ మండల అధ్యక్షుడు గోళ్ల సురేష్ యాదవ్, కటికల బాలకృష్ణ, మస్తాన్ జాని తదితరులు పాల్గొన్నారు. అలాగే తోట బజారులో టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిన శేషగిరిరావు, చెన్నకేశవస్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు పలిశెట్టి శ్రీనివాసరావు, చింతపల్లిలో టీడీపీ కార్యదర్శి పంగులూరి అంజయ్య, సర్పంచ్ మాధవి మల్లికార్జునరావు పింఛన్లను పంపిణీ చేశారు.

● రెంటచింతల: మండలంలో 92.21 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసరావు చెప్పారు. 6716 మందికి గాను 6189 మందికి రూ.2,95,16,000 అందజేశామన్నారు.

● పిడుగురాళ్ల: పట్టణ పరిధిలో అన్ని రకాల సామాజిక పింఛన్లను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, కూటమి నేతలు ఆయా వార్డుల్లో పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ సుబ్బారావు, పిల్లి చెన్నారావు, తురకా వీరస్వామి, వడ్డవల్లి సర్వేశ్వరరావు, పాండురంగ శ్రీను, తదితరులు ఆయా వార్డుల్లో లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.

కపోతేశ్వరాలయంలో కార్తీక దీపోత్సవం

నకరికల్లు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : చేజర్లలోని గంగా భ్రమరాంబ పార్వతి సమేత కపోతేశ్వర స్వామి దేవాలయంలో శనివారం రాత్రి కార్తీక దీపోత్సవం నిర్వహించారు. దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. విద్యుత్ కాంతులతో, కార్తీక దీపాలతో కపోతేశ్వరాలయంలో కార్తీక శోభ సంతరించుకున్నది. కార్తీక దీపోత్సవ ఏర్పాట్లను, నిర్వాహణను అట్లూరి మస్తానొరెడ్డి గ్రూపు విద్యా సంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ అట్లూరి శాంతి పర్యవేక్షించారు. గ్రామానికి చెందిన మహిళలు కార్తీక దీపోత్సవంలో పాల్గొన్నారు.



కార్తీక దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు

ఎస్ఐ గురుమూర్తి సేవలు ప్రశంసనీయం

● విద్యుత్ ప్రాజెక్టు ఎస్ఈ కె.వెంకటరమణ

రెంటచింతల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సత్రశాల విద్యుత్ ప్రాజెక్టు రక్షణలో ఎస్పీఎఫ్ (స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్) ఎస్ఐ గురుమూర్తి తన విధులను అంకితభావంతో నిర్వహించారని ప్రాజెక్టు ఎస్ఈ కె.వెంకటరమణ కొనియాడారు. సీఐగా పదోన్నతి పొంది తూర్పుగోదావరి జిల్లా రాజోలు ఓఎన్‌జీసీకి బదిలీపై వెళ్తున్న మూర్తిని ఘనంగా సత్కరించారు. ఆయన స్థానంలో ఎస్పీఎఫ్ ఎస్ఐగా రాష్ట్ర హైకోర్టు నుంచి వచ్చిన నారాయణరావు బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు, మల్లేష్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రెండు వందల మందికి ఆధార్ నమోదు



ఆధార్ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది

క్రోసూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఆధార్ నమోదు కేంద్రాలకు మంచి స్పందన లభిస్తుంది. శనివారం బయ్యవరం హైస్కూల్లో జరిగిన ఆధార్ నమోదు కార్యక్రమంలో సుమారు 60మందికి ఆధార్‌ను నమోదు చేశారు. ఇప్పటివరకు రెండు వందల మందికి ఆధార్ నమోదు, తప్పొప్పుల సవరణ, చిరునామాలను అప్‌డేట్ చేయటం, వేలి ముద్రలు అప్‌డేట్ చేయటం వంటి కార్యక్రమాలు పూర్తి చేశామన్నారు. మండలంలోని అన్ని హైస్కూళ్లలోను ఆధార్ నమోదుకేంద్రాలు తేదీల వారీగా జరుపుతున్నామని, ప్రజలందరూ వీటిని ఉపయోగించుకోవాలని ఆధార్ అసిస్టెంట్ మేదర రాఘవరాజు తెలియజేశారు.

డబుల్ రోడ్డు నిర్మాణం ప్రారంభం




క్రోసూరు సెంటర్లో ప్రారంభమైన రోడ్డు నిర్మాణ పనులు

క్రోసూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అమరావతి నుంచి బెల్లంకొండ వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. క్రోసూరు నాలుగు రోడ్ల సెంటర్లో రోడ్లను బాగు చేస్తూ నిర్మాణ కార్యక్రమాలను ప్రారంభించారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ చొరవతో పాత బాకీలు రూ.25 కోట్లు విడుదల కావటంతో నిర్మాణ పనులు పునఃప్రారంభించారు. మొత్తం 50 కిలో మీటర్లు డబుల్ రోడ్డు నిర్మాణంతో పాటు మధ్యలో 20 గ్రామాల పరిధిలో సిమెంట్ రోడ్ల నిర్మాణం చేయాల్సి ఉంది.

నకిలీ పురుగు మందులు అమ్మితే కేసులు : ఏవో

నకరికల్లు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నకిలీ పురుగు మందులను అమ్మితే కేసులు నమోదు చేయటంతో పాటు లైసెన్స్‌లను రద్దు చేస్తామని వ్యవ సాయ అధికారి కే దేవదాసు డీలర్లను హెచ్చరించారు. శనివారం నకరికల్లు, నరసింగపాడు గ్రామాల్లో ఆయన పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. గోడౌన్‌లలో నిల్వ ఉన్న పురుగు మందుల నిల్వలను పరిశీలించారు. పురుగు మందుల నమూనాలను పరిశీలించి నాణ్యత పరీక్షలకు ప్రయోగశాలకు పంపారు. పురుగు మందుల ప్యాకెట్లపై ఉన్న క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేయాలని సూచించారు. తేడాలు ఉన్నట్టు గుర్తిస్తే వ్యవసాయ అధికారికి ఫిర్యాదు చేయాలని.. చట్టపరమైన చర్యలను తీసుకుంటామని అన్నారు.

నకరికల్లులో డివిజన్ స్థాయి జట్ల ఎంపిక



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న డీవైఈవో ఏసుబాబు

నకరికల్లు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వంగా వెంకటరెడ్డి జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం సత్తెనపల్లి డివిజన్ ఖోఖో టోర్నమెంట్ బాలబాలికల జట్ల ఎంపికను నిర్వహించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ - 14, అండర్ - 17 విభాగంలో ఎంపికలకు పోటీలను సత్తెనపల్లి డివిజన్ డీవైఈవో పీ ఏసుబాబు ప్రారంభించారు. ఈ ఎంపికల్లో 250 మంది బాలబాలికలకు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన వారు జిల్లా స్థాయిలో జరిగే టోర్నమెంట్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జాలాది శ్రీనివాసరావు, విశ్రాంత పీడీ దాసరి కోటేశ్వరరావు, గుంటూరు జిల్లా ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి చింతా పుల్లాయ్య, డివిజనల్ కో-ఆర్డినేటర్ అనీల్ దత్తానాయక్, పీడీ ఝాన్సీరాణి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెదకూరపాడులో మ్యాచ్ తిలకించేందుకు బిగ్ స్క్రీన్ ఏర్పాటు

పెదకూరపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పెదకూర పాడులోని పంచాయతీరాజ్ అతిథి గృహంలో ఆదివారం ఇండియా, సౌత్ ఆఫ్రికా మహిళా వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌ని తిలకించేందుకు బిగ్ స్క్రీన్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కార్యాలయం శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. తెలుగుమహిళల కోసం ఈ స్క్రీన్‌ను ఏర్పాటు చేస్తుందని, ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆ ప్రకటనలో కోరారు.

సామాజిక పింఛన్లు పంపిణీ చేసిన కొమ్మాలపాటి



పొందుగలలో పెన్షన్లు పంపిణీ చేస్తున్న కొమ్మాలపాటి శ్రీధర్

అమరావతి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని పొందుగలలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ ప్రారంభించారు. నెల మొదటి రోజున పింఛన్లు పంపిణీ చేస్తున్న ఘనత కూటమికే దక్కుతుందన్నారు. మండలపరిధిలో 9,876 మందికి పెన్షన్లు పంపిణీ చేయాల్సి ఉండగా శనివారం సాయంత్రానికి 94శాతం పెన్షన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో పార్వతీ తెలిపారు. తహసీల్దార్ డానియేలు లేమల్లెలో పెన్షన్లు పంపిణీ చేశారు.

గాయత్రీ మాత విశ్వమందిరానికి శంకుస్థాపన

అమరావతి మండల పరిధిలోని పొందుగల గ్రామంలో గాయత్రీ తీర్థం శ్రీరామకృష్ణ ఆశ్రమంలో గాయత్రీ మాత విశ్వమందిరానికి శనివారం ఉదయం శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి అఖిల గాయత్రీ పరివార్ సంచాలకులు చిన్మయ పొండ్యా, టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొని శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో విశ్వమాత గాయత్రీ పీఠం నిర్వాహకులు పాల్గొన్నారు.

పౌర్ణమి ఏర్పాట్లను పరిశీలించిన ఆర్డీవో మురళీకృష్ణ

రెంటచింతల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈనెల 5వ తేదీన నిర్వహించనున్న కార్తీక పౌర్ణమి ఏర్పాట్లలో ఎటువంటి లోటుపాట్లు ఉండడానికి వీల్లేదని, ప్రతి భక్తుడు మనస్ఫూర్తిగా స్వామిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేయాలని గురజాల ఆర్డీవో మురళీకృష్ణ ఆదేశించారు. శనివారం సాయంత్రం సత్రశాలలోని కృష్ణానది పుష్కరఘాట్‌ను ఆయన పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ మేరి కనకం, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ జీవీ శివయ్య, ఈవో గాదె రామిరెడ్డి, పరాశక్తి సిమెంట్స్ పీఆర్‌వో కె వేణుగోపాలరెడ్డి తదితరులు ఉన్నారు.


మండాదిలో సాగవుతున్న ఆకుకూరలు

- మండాదిలో ఆదాయ వనరుగా ఆకుకూరల సాగు
- వచ్చిన నగదుతో ఇతర పంటలకు పెట్టుబడి
- ఆసామి అయినా అరెకరం అరకెత్తాల్సిందే..

ఆదాయ సిద్ధి.. ఆకుకూరకు ప్రసిద్ధి


మాచర్లలో విక్రయిస్తున్న ఆకుకూరలు

మాచర్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఫంక్షన్లకు, శుభకార్యాల్లో వంటలకు ఆకుకూరలు కావాలంటే గుర్తొచ్చేది ఆ గ్రామమే.. అనాదిగా గ్రామంలో కొందరు రైతులు ఆకుకూరలు సాగు చేపడుతున్నారు. పదెకరాల ఆసామి అయిన అరెకరమైనా.. ఈ సాగుపై శ్రద్ధచూపుతున్నారు. భూగర్భ జలాలు అడుగంటడంతో కొంతమంది సాగుకు ముఖం చాటేసినప్పటికీ మరికొందరు ఉన్న కొద్దిపాటి నీటితోనే ఆకుకూరల సాగును సాంప్రదాయంగా కొనసాగిస్తున్నారు.

రోజూ మార్కెట్‌కు పంట తరలింపు

వెల్దుర్తి మండలం మండాదిలో ఆకుకూరల సాగు బాగా సాగుతోంది. ప్రధానంగా పాలకూర, చుక్కకూర, తోటకూర, గోంగూర, కోయ తోటకూర, బచ్చలి, పొన్నగంటి కూర, కరివేపాకు, కొత్తిమీర వంటి ఆకు కూరలను సాగు చేస్తున్నారు. వీటిని మాచర్ల పట్టణానికి తీసుకొచ్చి కూరగాయల మార్కెట్లో విక్రయిస్తున్నారు.

అరెకరం రోజుకు 600 కట్టలు వరకు విక్రయిస్తున్నారు. కట్ట రూ.5 నుంచి రూ.10 దాకా అమ్ముతున్నారు. మాచర్ల నియో జకవర్గ పరిధిలోని శుభకార్యాలు, ఫంక్షన్లకు ఇక్కడే ఆకుకూరలను కొని తీసుకెళతారు. మాచర్ల పట్టణానికి 8 కిలోమీటర్ల సమీపంలో ఉన్న ఈ గ్రామం.. హైవే ఆనుకొని ఉండడంతో.. రవాణా సదుపాయం కలిసొచ్చిన అంశం. మండాది నుంచి ఆకుకూరలను మారు వ్యాపారులు కొనుగోలు చేసి నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు తరలిస్తుంటారు.



ఆదాయం ఇతర పంటలకు పెట్టుబడి

అరెకరంలో ఆకు కూరలు సాగుచేశా. నాకున్న ఆరెకరాల పొలంలో అరెకరం ఆకుకూరలు సాగు చేస్తున్నా. ఏటా ఆకుకూరల సాగుతో రూ. 70 వేలు దాకా ఆర్జిస్తున్నా. వాణిజ్య పంటల పెట్టుబడికి ఇది ఉపయోగపడుతోంది.

-కోటేశ్వరమ్మ, రైతు

ఆకుకూరల సాగే జీవనాధారం

నాకున్న 25 సెంట్లలోనే ఆకుకూరలు సాగుచేస్తున్నా. ఇదే నాకు జీవనాధారం. వాణిజ్య పంటలేవీ సాగు చేయడం లేదు. ఆకుకూరల సాగుపై వచ్చే రూ. 50 వేలతో కుటుంబ పోషణ జరుగుతోంది.

-వెంకటేశ్వరరెడ్డి, రైతు



నల్లమడ సమస్యకు శాశ్వత పరిష్కారం

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని


నల్లమడ వంతెన వరకు నడిచి వెళుతున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే రామాంజనేయులు, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

కాకుమాను/గుంటూరు నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నల్లమడ వాగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని కేంద్ర కమ్యూనికేషన్, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ రైతులకు భరోసా ఇచ్చారు. అప్పాపురం శివారు నల్లమడ డ్రెయిన్‌ను శనివారం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులతో కలసి ఆయన సందర్శించారు. రేటూరు శివారు జెండా చెట్టు వరకు కారులో విచ్చేసిన కేంద్రమంత్రి అక్కడి నుంచి రెండు కిలోమీటర్లు వరకు ట్రాక్టర్ పైన, అక్కడ నుంచి కిలోమీటరు వరకు నడచి ముంపు ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుంటూరు చానల్ ఆధునికీకరణ, విస్తరణ కోసం బడ్జెట్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. ఈ పనులు త్వరలోనే ప్రారంభం అవుతాయన్నారు. నల్లమడ డ్రెయిన్ శాశ్వత పరిష్కారం కింద కెనాల్ విస్తరణ, పూడిక తీతకు చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. ఆర్థిక భారం వల్ల ఈ పనులు ఏడాదిలో పూర్తి కాలేని పరిస్థితి ఉందన్నారు. నల్లమడ విస్తరణకు సుమారు 450 ఎకరాలు అవసరం కాగా, 120 ఎకరాలు ప్రభుత్వ భూములు ఉన్నాయని మరో 300 ఎకరాలు ప్రభుత్వం సేకరించాల్సి వస్తుందన్నారు. నల్లమడ సమస్యను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్తానని, అవసరమైతే కేంద్ర నిధులు కూడా మంజూరయ్యే విధంగా చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. నల్లమడ డ్రెయిన్‌లో ప్రస్తుతం పేరుకు పోయిన సిల్ట్‌ను యుద్ధ ప్రతిపాదికన తొలగించే చర్యలు తీసుకుంటాన్నారు. తుఫాన్ వలన పంటను నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ నల్లమడ వాగు సీ వాల్యూను ఐదు వందల వరకు పెంచాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వం సీ వాల్యూను పెదనందిపాడు, కొండపాటూరుల వద్ద పెంచిందన్నారు. ఆధునీకరణ కోసం నిధులు కూడా మంజూరు చేసిందని, గత వైసీపీ ప్రభుత్వం ఆ నిధులను నిలిపివేసి, పనులు చేయకపోవడం వలనే ఈ పరిస్థితి దాపురించిందన్నారు. రూ.375 కోట్లతో నల్లమడ పనులు ప్రారంభం అయ్యే విధంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. తహసీల్దారు వెంకట స్వామి, ఏవో సుధాకర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రమేష్, అధికారులు పాల్గొన్నారు.

రైతు పక్షపాతిగా సీసీఐ పనిచేయాలి

రైతు పక్షపాతిగా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) పనిచేయాలని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. పత్తి కొనుగోలుపై కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, ప్రత్తిపాడు ఎమ్మెల్యే డాక్టర్ బూర్ల రామాంజనేయులుతో కలిసి సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ రైతుల వాస్తవ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని సీసీఐ వ్యవహరించాలన్నారు. పత్తిని ఆర బెట్టుకునే సదుపాయం రైతుకు లేదని, రైతుల జీవన శైలిని దృష్టిలో పెట్టుకోవాలని చెప్పారు. అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ పత్తికి రూ.8,110 మద్దతు ధర ప్రకటించడం జరిగిందన్నారు. పత్తి కొనుగోలులో ఏర్పడుతున్న సాంకేతిక అవరోధాలు అధిగమించి కొనుగోలు జరిగేటట్లు అధికారులకు సూచనలు చేయడం జరిగిందని వివరించారు. జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఎన్.ఎస్.కె. ఖాజా వలి, సీసీఐ జనరల్ మేనేజర్ రాజేంద్ర షా, వ్యవసాయ శాఖ జేడీ అయితా నాగేశ్వరరావు, మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు సత్యనారాయణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం బ్యారేజీ వద్ద కొనసాగుతున్న వరద ఉధృతి

తాడేపల్లి టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టుతోపాటు, మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 1,67,175 క్యూసెక్కుల వరద నీరు శనివారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతుండగా అంతే నీటిని విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా డెల్టా కాల్వలకు నీటి విడుదల నిలిపివేశారు.


ప్రకాశం బ్యారేజ్ దిగువకు విడుదల అవుతున్న కృష్ణానది వరద నీరు

పులిచింతలలో 43.59 టీఎంసీలు

అచ్చంపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో శనివారం 43.59 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 1,27,970 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టు చేరుతున్నాయి. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600, లీకుల ద్వారా 400 వందలు, ఐదు గేట్ల ద్వారా 1,20,160 క్యూసెక్కుల నీరు, మొత్తం 1,37,160 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

పులిచింతలకు 1,23,904 క్యూసెకులు విడుదల

రెంటచింతల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సత్రశాలోని నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు 20 రేడియల్ క్రస్ట్‌గేట్లకు గాను 6 గేట్లను 3 మీటర్లు, 2 గేట్లను 2.5 మీటర్ల మేర ఎత్తి 1,19,736 , టెల్ రేస్ చానల్ ద్వారా 4,168.. మొత్తం 1,23,904 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె. వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు తెలిపారు. ఎగువన సాగర్, ఎత్తిపోతల, హాలియా వాగుల నుంచి 1,17,808 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల వరకు ఒక యూనిట్ ద్వారా 0.5480 ఎంయూల విద్యుదుత్పత్తి జరిగిందన్నారు. రిజర్వాయర్‌లో 75.50 మీటర్ల మేర నీరుండగా ఇది 7.080 టీఎంసీలకు సమానమన్నారు.


పులిచింతలకు విడుదలవుతున్న వరద నీరు

10 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

విజయపురిసౌత్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి వరద నీరు వచ్చి చేరుతుండడంతో శనివారం నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ అధికారులు ప్రాజెక్ట్ 10 క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం 589.80 అడుగులు ఉంది. ఇది 311.44 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 3,088, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,982, 10 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 80,790, మొత్తం ఔట్‌ఫ్లో 1,17,860 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు 1,17,860 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.


10 క్రస్ట్ గేట్ల ద్వారా విడుదలవుతున్న సాగర్ నీరు

మిర్చిని ముంచిన మొంథా

- కర్నూలులో వర్షం.. గుంటూరు మిర్చి యార్డుపై ప్రభావం
- ఈ ఏడాది పంట రాక ఆలస్యమంటున్న ట్రేడర్లు
- కోల్డ్ స్టోరేజ్‌ల నిల్వలకు డిమాండ్

గుంటూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏడాది నవంబరులో కర్నూలు జిల్లా నుంచి గుంటూరు వ్యవసాయ మార్కెట్ యార్డుకు వచ్చే మిర్చి ఈసారి ఆలస్యమయ్యే పరిస్థితి నెలకొంది. మొంథా తుపాను వల్ల అక్కడ కురిసిన వర్షాలతో వాగులు, చెరువులు ఉప్పొంగి మిర్చి పంటను దెబ్బతీశాయి. ప్రతి గ్రామంలో దాదాపుగా 10 నుంచి 15 శాతం వరకు పంటకు నష్టం జరిగినట్లు అక్కడి రైతుల నుంచి మిర్చియార్డులోని కమీషన్ వ్యాపారులు సమాచారం సేకరించారు. ఇంకా పొల్లాల్లో నీళ్లున్నాయని, వారం పాటు బాగా ఎండ కాస్తే మొక్కలు నిలదొక్కుకొంటాయని రైతులు వారికి తెలిపారు. ఈ నేపథ్యంలో శీతల గిడ్డంగుల్లో నిల్వఉన్న మిర్చి టిక్కీలకు డిమాండ్ పెరిగే అవకాశాలున్నట్లు భావిస్తున్నారు.

దిగుబడిపై లేని స్పష్టత

మిర్చి యార్డులో సీజన్ నవంబరు రెండో వారం నుంచి ప్రారంభమవుతుంది. ఇందుకు కారణం కర్నూలు జిల్లాలో సాగు చేసిన మిర్చి అప్పటికే తొలి విడత కోతలు పూర్తి అవుతాయి. దీంతో అక్కడి నుంచి నిత్యం 30 వేల టిక్కీల వరకు రైతులు మిర్చి యార్డుకు తీసుకొస్తుంటారు. ట్రేడర్లు వాటిని నాన్ ఏసీ కేటిగిరి కింద కొనుగోలు చేస్తారు. మరోవైపు కోల్డ్‌స్టోరేజ్‌ల నుంచి వచ్చే మిర్చిని ఏసీ కేటిగిరి కింద పరిగణించి కొనుగోళ్లు చేస్తుంటారు. దీంతో నవంబరు నుంచే మిర్చి యార్డులో 60 వేల టిక్కీల వరకు విక్రయం జరుగుతూ కళకళలాడుతుంటుంది. అయితే ఈ సంవత్సరం ఆ పరిస్థితి లేకుండా పోయింది. మరో వారం పది రోజుల్లో కోతలు జరగాల్సి ఉండగా మొంథా తుపానుతో వచ్చిన వరద ప్రవాహం కారణంగా మిర్చి మొక్కలు పలుచోట్ల పక్కకు ఒరిగిపోయాయి. పొలాల్లో నిలిచిన వరద నీటిని రైతులు బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టారు. అలానే పక్కకు వరిగిన మొక్కలను నిలబెట్టి పాదు వద్ద కాళ్లతో తొక్కుతున్నారు. ఆ తర్వాత దుక్కులు దున్ని నానో ఎరువులు అందించి మొక్కలు బతికించుకొనే ప్రయత్నం చేస్తున్నారు. దీనివలన పది రోజుల తర్వాతే పంట దిగుబడి ఎంత మేరకు తగ్గుతుందనే దానిపై స్పష్టత వస్తుందని వ్యాపారులు చెబుతున్నారు. కాగా మొంథా తుపాను, దసరా, దీపావళి సెలవుల కారణంగా కోల్డ్ స్టోరేజ్‌లలో నిల్వ ఉన్న 40 లక్షల టిక్కీలలో పెద్దగా విక్రయం జరగలేదని పేర్కొన్నారు. ఎగుమతుల్లో కూడా అంతగా రైజింగ్ లేదన్నారు. ఏది ఏమైనా మిర్చి యార్డుకు కొత్త పంట రాక మరో నెల సమయం పట్టే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. ఆ లోపు సాధ్యమైనంత ఎక్కువ సంఖ్యలో కోల్డ్ స్టోరేజ్‌లలో నిల్వఉన్న మిర్చి టిక్కీల విక్రయం జరిగితే రైతులకు కొంత మేలు జరుగుతుందని వివరించారు.


కర్నూలు జిల్లాలో మొంథా తుపాను వల్ల దెబ్బతిన్న మిర్చి పంట

మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం వైఫల్యం

- సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ



ప్రసంగిస్తున్న సీపీఐ నేత రామకృష్ణ

గుంటూరు(తూర్పు), నవంబరు1(ఆంధ్రజ్యోతి): వసతి గృహాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఇచ్ఛాపురం నుంచి హిందూపురం వరకు నిర్వహిస్తున్న బస్సు జాతా శనివారం గుంటూరు చేరుకుంది. ఈ సందర్భంగా శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. గూగుల్‌ను పక్కనబెట్టి విద్యార్థుల సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు. సమస్యలపై పోరాటం చేస్తున్న విద్యార్థి సంఘ నాయకులపై కేసులు నమోదు చేయడం సరైన విధానం కాదన్నారు. బస్సు జాతాకు అనుమతి నిరాకరించిన డీజీపీ వ్యవహారశైలి అప్రజాస్వామికమని మండిపడ్డారు. ఆ పదవికి ఆయన అనర్హుడని విమర్శించారు. డీజీపీ టీడీపీ నేతగా పనిచేస్తున్నారని ఎద్దేవా చేశారు. జీతం ప్రభుత్వం ఇస్తుందా...లేదంటే టీడీపీ ఇస్తుందా అని నిలదీశారు. ఆయన కనుసన్నల్లో లిక్కర్, ఇసుక మాఫియా నడుస్తుందని ఆరోపణలు చేశారు. డీజీపీ వ్యవహారంపై ముఖ్యమంత్రి స్పందించాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వలరాజు, నాసర్ జీ మాట్లాడుతూ పార్వతీపురంలో గిరిజన విద్యార్థులకు నీళ్ల లేక చనిపోతున్నా విద్యాశాఖ మంత్రి, అధికారులు కన్నెత్తి చూడలేదని మండిపడ్డారు. విద్యార్థుల మరణాలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ. 6,400 కోట్లు తక్షణమే విడుదల చేయాలన్నారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసే జీవో నంబరు 77 రద్దు చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాల యాల్లో ఖాళీగా ఉన్న 3,480 ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే జాతా ముగిసిన వెంటనే ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ విద్యార్థి విభాగపు నాయకుడు పానుగంటి చైతన్య, ఏఐఎస్ఎఫ్ నాయకులు యశ్వంత్, పల్లాయిస్వామి ఫణీంద్ర నాగభూషణ్, బాల నవ్యశ్రీ, సుమన్ చరణ్ పాల్గొన్నారు.

దినదిన గండం.. 60ఏళ్ల ఉద్యోగం

- ఏఎన్‌యూ అధ్యాపకేతర దినసరి ఉద్యోగుల్లో ఆందోళన
- అన్‌స్కిల్డ్ ఉద్యోగుల విరమణకు పాలక వర్గం చర్యలు
- జనన ధ్రువపత్రాలు లేనివారి వయస్సు నిర్ధారణకు ఎముకల పరీక్షలు
- ఆరు పదులు దాటిన వారు ఇంటికి

ఏఎన్‌యూ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వర్సిటీలోని అన్‌స్కిల్డ్ దినసరి ఉద్యోగుల వయస్సు నిర్ధారణకు ఏఎన్‌యూ పాలకవర్గం చర్యలు తీసుకుంది. ఎలాంటి వయసు ధ్రువీకరణ పత్రాలు లేని ఉద్యోగులకు ఎయిమ్స్‌లో ఎముకల పరీక్షలు చేయిస్తోంది. ఈ పరీక్షల్లో 60 ఏళ్ల దాటిన వారికి ఉద్యోగ విరమణ కల్పిస్తోంది. ఇప్పటికే ఇలా పరీక్షల్లో ఉద్యోగ విరమణ వయస్సు పైబడిన నలుగురిని ఇంటికి పంపించింది. అచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో శాశ్వత అధ్యాపకేతర ఉద్యోగుల కొరత ఉంది. దీంతో వారి స్థానంలో దినసరి ఉద్యోగులను 15 ఏళ్లుగా వర్సిటీ ఉన్నతాధికారులు నియమిస్తూ వస్తున్నారు. ఇలా 300మందికి పైగా ఆయా విభాగాల్లో ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిని స్కిల్డ్, సెమీస్కిల్డ్, అన్ స్కిల్డ్ మూడు క్యాటగిరులుగా విభజించి వేతనం చెల్లిస్తున్నారు. స్కిల్డ్ కేటగీరికి డిగ్రీని, సెమీ స్కిల్డ్ కేటగిరికి పదవ తరగతి విద్యార్హతగా నిర్ణయించారు. అన్ స్కిల్డ్ కేటగిరిక ఎలాంటి అర్హత లేదు. వీరిలో సుమారు వంద మంది లోపు అన్‌స్కిల్డ్ ఉద్యోగులకు ఎలాంటి విద్యార్హత లేదని సమాచారం.

ఎయిమ్స్‌లో పరీక్షలు..

విశ్వవిద్యాలయం అన్‌స్కిల్డ్ ఉద్యోగులకు రోజుకు రూ.900కు పైగా వేతనం చెల్లిస్తోంది. ఇటీవల వర్సిటీ పాలకవర్గం వీరి వేతనాలను పెంచడంతో పాటు ఉద్యోగ విరమణ వయసును 60 ఏళ్లుగా నిర్ణయించింది. అయితే అన్‌స్కిల్డ్ ఉద్యోగు లకు ఎలాంటి విద్యార్హత, జనన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో.. ఎముకల పరీక్షలు ద్వారా వారి వయస్సును నిర్ధారిస్తున్నారు. ఈ బాధ్యతను మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రికి అప్పగిస్తూ.. విశ్వవిద్యాలయం లేఖ రాసింది. దీంతో ఉద్యోగులు ఎయిమ్స్ ఆస్పత్రికి వెళ్లి ఎముకల పరీక్షలు చేయించుకుంటున్నారు. ఈ పరీక్షల ద్వారా వైద్యులు ఆయా ఉద్యోగుల వయస్సును నిర్ధారిస్తూ.. విశ్వవిద్యాలయానికి వైద్య నివేదికలను పంపుతున్నారు. వీటి ఆధారంగా వర్సిటీ ఆయా ఉద్యోగుల సర్వీసు రిజిస్టర్లలో వారి వయస్సును నమోదు చేస్తోంది. దీని ద్వారా ఉద్యోగ విరమణ కల్పిస్తోంది.



ఆందోళన.. సందేహాలు

ఎముకల పరీక్షకు ఎయిమ్స్ ఆసుపత్రికి వెళ్లిన ఉద్యోగులు తమ వయసును తక్కువగా చూపించేందుకు వైద్యులతో బేరసారాలు సాగిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఎముకల పరీక్ష ద్వారా వయస్సు నిర్ధారణ ఖచ్చితత్వంపై ఉద్యోగుల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో వారిలో ఆందోళన నెలకొంది. ఈ పరీక్షల ద్వారా కొన్ని నెలల క్రితం నలుగురు ఉద్యోగులకు వర్సిటీ ఉద్యోగ విరమణ కల్పించింది. ఇంకా మరికొంత మంది ఇంటికి వెళ్లనున్నారు.

డిగ్రీ లేని వారిలో అలజడి

విశ్వవిద్యాలయం కొందరు దినసరి ఉద్యోగులకు డిగ్రీ అర్హత లేకుండానే స్కిల్డ్ కేటగిరి కింద వేతనాలు చెల్లిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వారి విద్యార్హత సర్టిఫికెట్లను సమర్పించాలని వర్సిటీ ఆదేశించింది. దీంతో డిగ్రీ అర్హత లేని ఉద్యోగుల్లో అలజడి రేగింది. కొందరు నేటికీ సర్టిఫికెట్లు సమర్పించలేదని తెలిసింది. విశ్వవిద్యాలయంలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న దినసరి ఉద్యోగుల పరిస్థితి దినదినం ఉద్యోగ విమరణ గండంగా మారింది. ఎముకల పరీక్షల ద్వారా వయస్సును నిర్ధారించడంతోపాటు ఉద్యోగ విరమణ నిబంధనను అమలు చేస్తూ తమ పొట్ట కొట్టొద్దంటూ దినసరి ఉద్యోగుల కోరుతున్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

వైజ్ఞానిక ప్రదర్శనకు మోడల్ స్కూల్ విద్యార్థులు

రొంపిచర్ల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపాలెంలో గల పీఎం శ్రీ ఏపీ మోడల్ పాఠశాల విద్యార్థులు శనివారం వైజ్ఞానిక ప్రదర్శనకు తరలివెళ్ళారు. మొదట కోటప్పకొండలోని త్రికోటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించిన తరువాత జంతు ప్రదర్శనశాల, పార్కులను తిలకించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయ సహకారంతో కార్యక్రమాన్ని నిర్వహించిన్నట్టు ప్రిన్సిపాల్ రవి నాయక్ తెలిపారు. ఎంఈవో బ్రహ్మేశ్వరరావు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్లు ఎంపిక

మండలంలోని రొంపిచర్ల జడ్పీ పాఠశాలలో ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్ 14, 17 విభాగాల్లో బాలుర, బాలికల సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక శనివారం జరిగింది. ఎంపికైన జట్లు ఈ నెల 20వ తేదీ నుంచి 22 వరకు పశ్చిమ గోదావరి, అలాగే 22 నుంచి 25వ తేదీ వరకు కడప జిల్లా పులివెందులలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని హెచ్ఎం సుభానీ తెలిపారు. కార్యక్రమంలో పీడీ సైదయ్య పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో తనిఖీ

మండలంలోని రొంపిచర్ల, రెడ్డిపాలెం, ఆరేపల్లి గ్రామాల్లోని మద్యం దుకాణాలను ఈపూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారులు శనివారం తనిఖీ చేశారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. గతంలో మద్యం అమ్మిన సంతగుడిపాడుకు చెందిన ముగ్గురు వ్యక్తులను తహసీల్దార్ బండి నిర్మల ఎదుట బైండోవర్ చేశారు.

పొలాలను పరిశీలించిన పీడీఎం నాయకులు

మండలంలోని సంతగుడిపాడు గ్రామంలో వర్షాలకు దెబ్బతిన్న పొలాలను పీడీఎం నాయకులు శనివారం పరిశీలించారు. వ్యవసాయ అధికారులు పర్యటించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎం నాయకులు వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, కోటా నాయక్, షేక్ మస్తాన్‌వలి, రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

నారాయణలో స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్

వినుకొండటౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక నారాయణ పాఠశాలలో శనివారం స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పల్నాడు జిల్లా ఏజీఎం లక్ష్మణ్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ, ఏ పాఠశాలలో లేనివిధంగా నారాయణ విద్యావ్యవస్థలో విద్యా ప్రణాళిక రూపొందించామని చెప్పారు. విద్యార్థులకు అర్థవంతమైన రీతిలో లెసన్ ప్లానింగ్ ద్వారా తరగతులు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ హర్షవర్ధన్ రెడ్డి, ఆర్ అండ్ డీ హెడ్ వాణి, కోఆర్డినేటర్ గౌస్య, వైస్ ప్రిన్సిపాల్ రాగ సుధా, పాఠశాల విద్యార్థిని,విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏకాదశి పూజలు

పట్టణంలోని శ్రీనివాసనగర్ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఏకాదశి సందర్భంగ భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వృద్ధురాలి మృతదేహం అప్పగింత

వినుకొండటౌన్: వినుకొండ ఆర్టీసీ డిపో ఆవరణలో గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని పోలీసులు ఎట్టకేలకు బంధువులకు అప్పగించారు. గుంటూరు సమీపంలోని పెదకాకానికి చెందిన గంధం రాహేలమ్మగా గుర్తించి బంధువులకు సమాచారం అందించి మృతదేహాన్ని కుమారులకు అప్పగించారు. కొన్నాళ్లుగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నట్లు తెలిపారు.

ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడిగా రామారావు

ఈపూరు: ఈపూర్ తా లూకా ఎన్జీవో అసోసియేషన్ నూతన ఎన్నిక శనివారం ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా ఎస్.రామారావు, కార్యదర్శిగా ఏడుకొండలు, కోశాధికారిగా కె.రమాదేవి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఏ.కోటేశ్వరరావు, ముఖ్యఅతిథిగా జిల్లా కమిటీ చైర్మన్ ఎం.రామకృష్ణ, రామయ్య హాజరయ్యారు.

వయ్యకల్లు వైసీపీ అధ్యక్షుడిగా సుభానయ్య

శావల్యాపురం: మండలంలోని వయ్యకల్లు గ్రామంలో వైసీపీ గ్రామకమిటీ ఎన్నికను శనివారం నిర్వహించారు. గ్రామపార్టీ అధ్యక్షుడిగా కావూరి మాబుసుభానయ్య, ప్రధానకార్యదర్శిగా దారా లింగారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం మెడికల్ కాలేజీలపై కూటమి ప్రభుత్వ పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తూ మతుకుమల్లిలో సంతకాల సేకరణ నిర్వహించారు. వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

బీమా చెక్కు పంపిణీ

బొల్లాపల్లి: మండలంలోని మూగచింతలపాలెం గ్రామానికి చెందిన పాలడుగు నాగేశ్వరరావు ఇటీవల ప్రమాదవశాత్తు మరణించగా ప్రభుత్వం అందించే రూ 5 లక్షల చెక్కును ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ శనివారం బీమా చెక్కును మృతుని కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పెమ్మసాని నాగేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు హనుమానాయక్, నాయకులు పోకా వెంకటరావు, తిప్పిశెట్టి వెంకటేశ్వర్లు, ఎలిశెట్టి రంగయ్య ఉన్నారు.

శ్మశాన వాటికల పరిశీలన

చిలకలూరిపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తుఫాను నేపథ్యంలో పట్టణంలోని పలు శ్మశాన వాటికలను మున్సిపల్ చైర్మన్ రఫాని శనివారం సందర్శించారు. ఏఎంజీ సమీపంలో ఉన్న శ్మశానవాటికలో నీరు నిలిచిపోయి సమాధులు మునిగిపోగా నీటిని మోటార్ల ద్వారా వెంటనే తోడించి ప్రజలకు అసౌకర్యం లేకుండా చూడాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. 27 వార్డ్ నందు విశ్వబ్రాహ్మణ, హిందూ, క్రిస్టియన్ శ్మశాన వాటికలను పరిశీలించి జంగిల్ క్లియర్ చేయాలని ఆదేశించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సాతులూరు విద్యార్థులు

నాదెండ్ల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాతులూరు గ్రామం జెడ్పీ హైస్కూలుకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన అద్దంకి వివేక్, సిద్దాబత్తుని మోహన్‌లక్ష్మి, గురుగింజల దయాకర్‌లను హెచ్ఎం వెంకటరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

రేమిడిచర్ల గౌరీశంకర్ దేవాలయానికి రూ.16 లక్షల విరాళం

బొల్లాపల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీగంగా గౌరీశంకర్ దేవాలయ అభివృద్ధికి పెండాల కోటేశ్వరరావు దంపతులు రూ.16లక్షలు శనివారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దేవాలయ ఆలయ కమిటీ, గ్రామస్తులు కోటేశ్వరరావు దంపతులను సన్మానించారు. ఏకాదశి పర్వదినాన స్వామి వారికి విశేష అభిషేకాలు, అలంకరణ చేశారు.



రేమిడిచర్లలో గౌరీశంకర్ దేవాలయానికి విరాళం ఇస్తున్న పెండాల కోటేశ్వరరావు



వినుకొండ: పింఛన్ పంపిణీ చేస్తూ వృద్ధురాలితో సెల్ఫీ దిగుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ, జీడీసీసీబీ చైర్మన్ మక్కెన

రెండు నెలల్లో కొత్త పింఛన్లు

● ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ

వినుకొండటౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 15వ వార్డు శాలివాహన నగర్‌లో శనివారం పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ప్రారంభించారు. వృద్ధులకు, వికలాంగులకు ఇంటింటికి తిరిగి పింఛన్లు పంపిణీ చేసి వారితో సెల్ఫీలు దిగారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ కొత్త పింఛన్లు రెండునెలల్లో ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం మార్కాపురం రోడ్డులో సుమారు రూ.9లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

వినుకొండ: ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నరసరావుపేట రోడ్డులో ఉన్న పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహానికి జీవీ ఆంజనేయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంకోసం ప్రాణాలర్పించిన త్యాగి పొట్టి శ్రీరాములన్నారు. ఆయా కార్యక్రమాల్లో జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్, బీజేపీ నాయకుడు మేడం రమేశ్, కౌన్సిలర్ షకీలాబేగం, జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు గుడివాడ చిన్న గురునాథం, మోటమర్రి నరసింహారావు, పువ్వాడ కృష్ణ, రెడ్డి వెంకటరత్నం, ఇమ్మడిశెట్టి రమేష్, బొంకూరి రోశయ్య, గజవల్లి నాగ పవన్, పల్లమీసాల దాసయ్యపివి సురేష్, అచ్యుత కోటేశ్వరరావు, జనసేన పార్టీ నాయకులు కొంజేటి నాగశ్రీనురాయల్, పట్టణపార్టీ అధ్యక్షుడు బొంకూరి రోశయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి పత్తి పూర్ణ, కాంట్రాక్టర్ జానీ, ఆయూబ్ ఖాన్, అజీజ్, దాసయ్య, గంధం సుబ్బారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు. కాగా, కాశీబుగ్గలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాట తీవ్ర దిగ్భ్రాంతికరమని జీవీ పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢసానుభూతి తెలిపారు.

ఆధునిక పరికరాలతో రైతులకు ప్రోత్సాహం

నూజెండ్ల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆధునిక వ్యవసాయ పరికరాలు రైతులకు రాయితీపై అందజేసి ప్రోత్సహిస్తున్నామని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. నూజెండ్లలో శనివారం 80 శాతం రాయితీపై డ్రోన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ రైతులకు వ్యవసాయం లాభసాటిగా మార్చేందుకు ఎన్‌డీఏ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ఈ సందర్భంగా నూజెండ్లలో జీవీ కూలీలతో కలసి వరినాట్లు వేశారు. మండలంలోని అప్పాపురం ఎస్సీ కాలనీలో లబ్ధిదారులకు ఆయన పింఛన్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నూజెండ్ల, గుర్రపునాయుడుపాలెం సొసైటీ ఛైర్‌పర్సన్‌లు బచ్చు అంజిరెడ్డి, ముంద్రు సుబ్బారావు, ములకలూరు డీసీ చైర్మన్ నక్కా బుల్లీశ్వరరెడ్డి, వినుకొండ మార్కెట్‌యార్డు చైర్మన్ మీసాల మురళీకృష్ణయాదవ్, ఏడీఏ రవికుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు గంగినేని రాధాకృష్ణమూర్తి, జనసేన నాయకుడు నాగ శ్రీనురాయల్, పసుపులేటి రాజబాబు, రావుల శ్రీకాంత్, టీడీపీ నాయకులు లగడపాటి వెంకటరావు, గంగినేని ఆంజనేయులు, లగడపాటి సూరిబాబు, బేతపూడి చిరంజీవి, కంచుమాటి నరేష్ తదితరులు పాల్గొన్నారు.



నూజెండ్లలో నాటు వేస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

అమృత్ పథకంతో చిలకలూరిపేటకు మహర్దశ

● చైర్మన్ రఫాని

చిలకలూరిపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): వచ్చే రెండేళ్లలో రూ.116కోట్ల వ్యయంతో అమృత్ పథకం రెండో దశ పూర్తవుతుందని, దీనితో చిలకలూరిపేటకు మహర్దశ పట్టనున్నదని మునిసిపల్ చైర్మన్ షేక్ రఫాని శనివారం తెలిపారు. మునిసిపల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నకరికల్లు వద్ద నాగార్జునసాగర్ బ్రాంచ్ కాల్వ నుంచి చిలకలూరిపేట మంచినీటి చెరువు వరకు ఇప్పటికే పూర్తయిన 40 కి.మీ ప్రధాన భూగర్భ పైప్ లైన్‌ను మరో 7 కి.మీ. మేర నిర్మాణం కొనసాగిస్తామని చెప్పారు. దీనితో కాల్వ నీరు చెరువులకు నిరంతరం ప్రవహిస్తుందన్నారు. పట్టణంలో కొత్తగా 3,500 కుళాయి కనెక్షన్లు ఇచ్చి, పట్టణమంతా ప్రతిరోజూ నీటి సరఫరా జరుపుతామని తెలిపారు. పట్టణంలో పైప్ లైన్ల లీకేజ్ అధికంగా ఉన్న ప్రాంతాలలో కొత్త పైప్‌లైన్‌ల నిర్మాణం చేపడతామని వెల్లడించారు. ఈ పథకంలో గతంలో మున్సిపాలిటీ వాటా 61 శాతంగా ఉండగా ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కృషిచేసి దానిని ఈసారి 13శాతానికి తగ్గించి మున్సిపాలిటిపై భారాన్ని తగ్గించారని తెలిపారు. మొత్తం అమృత్ పథకం బడ్జెట్ రూ.227 కోట్లు కాగా మొదటి దశ పూర్తయిందని, 40 కి.మీ మేర ప్రధాన నీటిపైప్‌లైన్ నిర్మాణం, 4వేల మంచి నీటి కనెక్షన్లు ఇచ్చామని వివరించారు. రెండో దశ పనులకు టెండర్లు పిలిచారని, ఒకటి రెండు నెలలలో పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ డీఈఈ రహీం, ఏఈ నాగబ్రహ్మాచారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మునిసిపల్ చైర్మన్ షేక్ రఫాని, పక్కనే డీఈ రహీం, ఏఈ నాగ బ్రహ్మాచారి

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

చిలకలూరిపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో శనివారం ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం జరిగింది. జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎక్సైజ్ సీఐ గోరంట్ల నారాయణ ముఖ్య అతిథిగా ఆంధ్రరాష్ట్రం కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన ఆమరణ దీక్ష గురించి వివరించారు. తొలుత పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చౌత్రా సెంటర్ ఆంజనేయ స్వామి గుడి వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గార్ల్స్ ఉపాధ్యక్షుడు గేరా యాకోబు, దాసరి చిట్టిబాబు, గ్రంథాలయ అభివృద్ధికమిటీ కార్యదర్శి దార్ల బుజ్జిబాబు, పీవీ సుబ్బారావు, సభ్యులు సిద్ధాంతి కరిముల్లా, డీ వీర్రాజు, బి.అజయ్ బాబు, చంద్రపట్ల మణికుమార్ పాల్గొన్నారు.

● నాదెండ్ల: మండలంలోని సాతులూరు గ్రామంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ఐనవోలు రాధాకృష్ణమూర్తి, శివనాగేశ్వరరావు, నరసింహారావు, హనుమంతరావు, నాగేశ్వరరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు రహదారి భద్రతా ప్రమాణాలు పాటించాలి

● జిల్లా రవాణాశాఖ అధికారి సంజీవకుమార్



మాట్లాడుతున్న జిల్లా రవాణాశాఖ అధికారి సంజీవకుమార్

నరసరావుపేట రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు రహదారి భద్రతా ప్రమాణాలు పాటించాలని జిల్లా రవాణాశాఖ అధికారి సంజీవకుమార్ కోరారు. స్థానిక నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం రెండో సంవత్సరం బీటెక్ విద్యార్థులు ఫ్రెషర్స్‌డే వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా రవాణఅధికారి సంజీవకుమార్ మాట్లాడుతూ, నిత్యం జరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో 70శాతం యువతే ఉంటున్నారన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకటకోటేశ్వరరావు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శివనాగేశ్వరరావు, కళాశాల వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మిట్టపల్లి రమేశ్ బాబు తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ కిరణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఎండీ షేక్ మస్తాన్ షరీఫ్ తదితరులు

ఈశ్వర్‌లో వృత్తి అవకాశాలపై అవగాహన కార్యక్రమం

నరసరావుపేట టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్, ఈశ్వర్ ఇన్నోవేషన్ గెలాక్సీ ఫౌండేషన్ సంయుక్తంగా ఉద్యమశీలత, ఆవిష్కరణ, వృత్తి అవకాశాలు అనే అంశంపై అవగాహన శిబిరాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జి. నాగమల్లేశ్వరరావు తెలిపారు. కార్యక్రమానికి ప్రధాన అతిథిగా విజయవాడ ఎస్‌టీపీవో డిప్యూటీ డైరెక్టర్ డి.కిరణ్‌కుమార్ విచ్చేశారని చెప్పారు. కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ షేక్ ముజీర్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీమ్ మొహీద్దీన్, ఎండీ షేక్ మస్తాన్ షరీఫ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ నజీమా, చైర్మన్ షేక్ మీరావలి, విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలను విడుదల చేయాలి: ఏఐఎస్ఎఫ్

నరసరావుపేట రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని పేర్కొంటూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రవ్యాప్త బస్సు జాతా శనివారం నరసరావుపేటచేరింది. ఈ సందర్భంగా పట్టణంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వలరాజు, నాసర్‌జీ, రాష్ట్ర సహాయ కార్యదర్శులు కుల్లాయిస్వామి ఫణీంద్ర నాగభూషణ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బాలనవ్యశ్రీ మాట్లాడుతూ, డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ చదువుకున్న విద్యార్థులకు పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు రూ.6400కోట్లను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో జాత నాయకులు అభిసుమన్ చరణ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు భూదాల మనోహర్, పసల దుర్గాప్రసాద్, విద్యార్థినిలు, సీపీఐ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, సత్యనారాయణరాజు, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు అంజిరెడ్డి, కొయ్య శ్రీను, రాజు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కృష్ణవేణిలో పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు తదితరులు

నరసరావుపేట టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చేసిన పోరాటం అందరికీ స్ఫూర్తిదాయం అని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు అన్నారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

● కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ



దెబ్బతిన్న పత్తిపంటను పరిశీలిస్తున్న కౌలురైతుసంఘం జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, రైతు సంఘం నాయకులు

యడ్లపాడు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా పంటనష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వై.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. రెండు రోజులుగా రైతు సంఘం నాయకులతో కలసి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ, తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు నియోజకవర్గంలో భారీగా పంటనష్టం జరిగిందన్నారు. పంటల బీమాను అమలుచేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. కౌలురైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలుచేస్తామని ప్రకటన చేసినా ఇంతవరకు లబ్ధిదారుల జాబితా ప్రకటించలేదన్నారు. నష్టపోయిన రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి సహాయం చేయాలని రాధాకృష్ణ కోరారు.

కే-రిడ్జి ఇంటర్నేషనల్ స్కూల్‌లో....

కే-రిడ్జి ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవ కార్యక్రమం శనివారం నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, ప్రిన్సిపాల్ జి.బర్నబాస్, అకడమిక్ ఆఫీసర్ టి. విజయరాజు, క్యాంపస్ ఇన్‌చార్జి కోట బాపూజీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ జి.బర్నబాస్ తదితరులు

బైకును ఢీకొట్టిన లారీ ; ఒకరికి గాయాలు

శావల్యాపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): బైకును లారీ వెనుకనుండి ఢీకొట్టడంతో వ్యక్తికి గాయాలైన సంఘటన గుంటూరు-కర్నూలు జాతీయ రహదారిపై శావల్యాపురం పీహెచ్‌సీ సమీపంలో శనివారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం మేరకు మండలంలోని గుర్రంవారిపాలేనికి చెందిన కన్నెదారి వెంకటకోటయ్య నరసరావుపేట వైపునుండి స్వగ్రామానికి బైకుపై వెళుతుండగా లారీ వెనుకనుండి ఢీకొట్టింది. వెంకటకోటయ్య కుడిచేయి విరిగింది. 108సిబ్బంది వెంకటకోటయ్యను వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటనస్థలాన్ని ఎస్ఐ లోకేశ్వరరావు పరిశీలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యవసాయ సహాయకురాలిని దూషించిన వ్యక్తి అరెస్టు

యడ్లపాడు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): విధుల్లో ఉన్న గ్రామ వ్యవసాయ సహాయకురాలి పట్ల అనుచితంగా ప్రవర్తించడం.. బహిరంగంగా దూషించిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. చెంఘీజ్‌ఖాన్‌పేటకి చెందిన బళల వెంకటేశ్వర్లు స్థానిక ఆర్‌ఎస్‌కేలో వ్యవసాయ సహాయకురాలి విధుల్లో తరచూ జోక్యం చేసుకుంటున్నాడు. ఆమెపై ఉన్నతాధికారులకు తప్పుడు ఆరోపణలతో ఫిర్యాదుచేయడం, సోషల్ మీడియాలో తప్పుడు ఆడియోలు ప్రచారం చేస్తూ అవమానిస్తున్నాడు. ఇటీవల పంట నష్టాన్ని నమోదుచేసేందుకు క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లిన సమయంలో వెంకటేశ్వర్లు ఆమెని దూషించాడు. ఈ ఘటనపై ఆమె యడ్లపా డు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా నిందితుడిని అరెస్ట్‌చేసి శనివారం కోర్టులో హజరుపరిచినట్లు ఎస్ఐ శివరామకృష్ణ తెలిపారు.

కాశీబుగ్గ మరణాలపై ప్రభుత్వానిదే బాధ్యత: గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో భక్తుల మరణాలపై ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని వైసీపీ జిల్లా కార్యనిర్వహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. పట్టణంలోని గుంటూరు రోడ్డులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాశిబుగ్గ వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాట ఘటనలో పది మంది భక్తులు మృతి చెందటం బాధాకరమని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వైకుంఠ ఏకాదశి రోజున తిరుపతిలో తొక్కిసలాట జరిగి ఆరుగురు, సింహాచలం అప్పన్న దేవాలయంలో గోడ కూలి ఏడుగురు చనిపోయారన్నారు. దేవాలయాలకు వెళ్లిన భక్తులు తిరిగి వస్తారో.. రారో తెలియని దుస్థితి రాష్ట్రంలో నెలకొందని అన్నారు. ఇది పూర్తిగా ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు. దేవాలయాల వద్ద తగినంత భద్రతను ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిది కాదా అని ప్రశ్నించారు. కార్తీక మాసంలో దేవాలయాలకు వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారని, తక్షణమే ప్రతి దేవాలయం వద్ద సెక్యూరిటీని ఏర్పాటు చేయాలని గోపిరెడ్డి కోరారు.

మెరుగైన పారిశుధ్య సేవలకు కృషి

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలో మెరుగైన పారిశుధ్య సేవలందించేందుకు కృషిచేస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. పట్టణంలోని మునిసిపల్ బంగ్లా వద్ద నూతనంగా కొనుగోలుచేసిన జేసీబీ, ట్రాక్టర్ విత్ డోజర్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నరసరావుపేట మునిసిపాలిటిలో డ్రైనేజీలలో గుర్రపుడెక్క తొలగించేందుకు, బిల్డింగ్ మెటీరియల్ చదునుకు ట్రాక్టర్ విత్ డోజరును వినియోగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ జస్వంతరావు, మునిసిపల్ అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



నూతన జేసీబీ, ట్రాక్టర్ విత్ దోజర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

ప్రతి నెలా రూ.1000 దాచుకోండి..

నరసరావుపేట టౌన్: పింఛను లబ్ధిదారులు తమకు అందిన నగదులో ప్రతినెలా రూ.1000 ఆదా చేసుకోవాలని ఎమ్మెల్యే అరవిందబాబు సలహా ఇచ్చారు. నరసరావుపేట పట్టణంలో ఇంటింటికీ ఆయన తిరిగి పింఛన్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతినెలా ఒకటో తేదీన పింఛను అందించేందుకు ప్ర భుత్వం సంసిద్ధంగా ఉంద న్నారు.



పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు, గోనుగుంట్ల కోటేశ్వరరావు

పొట్టి శ్రీరాములు జీవితం భావితరాలకు ఆదర్శం

పొట్టి శ్రీరాములు జీవితం భావితరాలకు ఆదర్శమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నరసరావుపేటలో ఘనంగా నిర్వహించారు. స్థానిక టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలో శివునిబొమ్మ సెంటర్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు సేవా సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర అవతరణ వేడుకలలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, బులి మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, మాజీ కౌన్సిలర్ కదం నాగజ్యోతి, అత్తులూరి సుబ్బారావు, చింతిరాల బాలు, క్రాంతి, డి.వీరయ్యచౌదరి, వెంకటేశ్వరరెడ్డి, రావెళ్ల నాగేశ్వరరావు, సుభాని పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

చిలకలూరిపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులున్నా గత 20 నెలలలో రాష్ట్రంలో రూ.55వేల కోట్లమేర ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందించిన ఘనత సీఎం చంద్రబాబుదేనని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శనివారం అన్నారు. ఒక్క చిలకలూరిపేట నియోజకవర్గంలోనే 36,728మందికి రూ.16.28 కోట్ల మొత్తాన్ని ఈ నెలలో పింఛన్లుగా అందిస్తున్నట్టు తెలిపారు. పట్టణంలోని 37, 38 వార్డులు, చిలకలూరిపేట, నాదెండ్ల, యడ్లపాడు మండలాల పరిధిలోని లింగుంగుంట్ల, అప్పాపురం, దింతెనపాడు గ్రామాలలో ఆయన పర్యటించి పింఛన్లు పంపిణీచేశారు. కార్యక్రమాలలో కూటమి పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు. పట్టణంలోని గడియారస్తంభం వద్ద శ్రీ పోలేరమ్మ తల్లి దేవస్థానంలో మండప కమిటీ, దాతల ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప పడిపూజలో భాగంగా శ్రీచిన్నగురుస్వామిచే 18మెట్ల కలశ పూజ, అభిషేకం వైభవంగా జరిగింది. ప్రత్యేకపూజల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు.



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

● శావల్యాపురం: మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కనమర్లపూడిలో తెలుగురైతు జిల్లా ఉపాధ్యక్షులు గోరింట్ల హనుమంతరావు, శావల్యాపురంలో సాగునీటి సంఘం అధ్యక్షులు చెరుకూరి రామాంజనేయులు, మండల ప్రత్యేకాధికారి మూలె వెంకటరెడ్డి, ఎంపీడీవో సీతారామయ్య, ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో యాకోబులు పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.



శావల్యాపురం: పింఛను అందజేస్తున్న తెలుగు రైతు జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతరావు

● బొల్లాపల్లి: మండలంలోని వడ్డెంగుంట గ్రామంలో శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ల పంపిణీ జరిగింది. కార్యక్రమంలో ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పెమ్మసాని నాగేశ్వరరావు, ఆర్ఐ నరసింహారావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గోడ నిర్మాణం పరిశీలన

ఈపూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నెస్పీ మెయిన్ కెనాల్‌పై పెరుమలపల్లి మేజర్ హెడ్ వద్ద జరుగుతున్న గోడ నిర్మాణ పనులను శనివారం వినుకొండ డీసీ చైర్మన్ గడిపూడి వేణుగోపాలరావు పరిశీలించారు. రెండు రోజుల్లో నిర్మాణ పనులు పూర్తి చేసి మేజర్‌కు సాగునీటిని విడుదల చేస్తామని చెప్పారు. చైర్మన్‌తో పాటు సాగునీటి సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు, మెయిన్ కెనాల్ ఏఈ యుగంధర్, శివయ్య ఉన్నారు.



గోడ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న డీసీ చైర్మన్ వేణుగోపాలరావు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వినుకొండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను మరమ్మతుల నిమిత్తం ఆదివారం వినుకొండ టౌన్, రూరల్ మండలం, నూజెండ్ల మండలాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏడీఈ శ్రీనివాసరావు శనివారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

భాష్యంలో ఘనంగా ఒలంపస్ గేమ్స్ ఫైనల్స్

నరసరావుపేట టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వినుకొండ రోడ్డులో ఉన్న భాష్యం హైస్కూల్‌లో శనివారం భాష్యం ఒలంపస్ ఆటల పోటీల ఫైనల్స్ శనివారం ఘనంగా నిర్వహించారు. క్రికెట్, ఖో-ఖో, కబడ్డీ, రన్నింగ్, త్రోబాల్ తదితర అంశాలలో పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వన్‌టౌన్ ఎస్ఐ అరుణరెడ్డి మాట్లాడుతూ, ఆటలు విద్యార్థులలో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో నరసరావుపేట జోనల్ ఇన్‌చార్జి ఎం.హృదయరాజ్, ప్రిన్సిపాల్ బి.ప్రశాంతి, పీఈటీలు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ముఖ్య అతిథి వన్‌టౌన్ ఎస్ఐ అరుణరెడ్డిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ బీ ప్రశాంతి తదితరులు